


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 08-12-2022 సంపుటి : 04 సంచిక :95 పేజీలు : 4 వెల : రూ 3-00


# బీసీలను బెదిరించాడు.. చంద్రబాబుకు ఖచ్చితంగా ఇవే చివరి ఎన్నికలు: సీఎం జగన్



కృష్ణా: టీడీపీ హయాంలో బీసీలకు అన్యాయం జరిగింది. కానీ, మన పాలనలో రాజ్యాధికారంలో బీసీలు భాగస్వామ్యం అయ్యారు. రాజ్యసాధికారికతకు బీసీలు నిదర్శనంగా నిలిచారు.ఇదే విషయాన్ని ప్రతిపక్ష నేత చంద్రబాబుకు చెప్పండని సీఎం వైఎస్ జగన్.. విజయవాడ జయహో బీసీ మహాసభలో బీసీ శ్రేణులను ఉద్దేశించి పిలుపు ఇచ్చారు.ఖబడ్దార్ మీ అంతు చూస్తా అని బీసీలను చంద్రబాబు బెదిరించాడు. తోకలు కత్తిరిస్తానన్నాడు. కానీ, బీసీలు రాజ్యాధికారంలో భాగస్వాములనే విషయం చంద్రబాబుకు చెప్పండి. బీసీలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని చంద్రబాబుకు గుర్తు చేయండి. చేసిన మోసాలను, నయవంచనను గుర్తు చేయండి. ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పండి అని సీఎం జగన్ ప్రసంగించారు.మీ బిడ్డ జగన్ వయసు 49 ఏళ్లు. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చి 45 ఏళ్లు అవుతోంది. కానీ, 2024లో ఒంటరిగా పోటీ చేస్తానని చంద్రబాబు చెప్పలేకపోతున్నారు. చేసిందేమీ లేక అబద్ధాలతో మోసం చేయాలని చూస్తున్నారు. ఎందుకంటే చెప్పుకోవడానికి చంద్రబాబు బీసీల కోసం ఒక్క మంచి పని చేయలేదు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, దత్తపుత్రుడిపై పడుతున్నాడు.చరిత్రలో ఎవరూ వేయని విధంగా అడుగులు వేశాం. బీసీ కులాలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేశాం. సంక్షేమ పథకాల్లో పేద సామాజిక వర్గాలకే పెద్ద పీట వేశాం. ఆర్థిక సాధికారత కోసం రూ.3 లక్షల 19 వేల 228 కోట్లు ఖర్చు చేశాం. ఇందులో 80 శాతం డబ్బు పేద సామాజిక వర్గాలకు ఖర్చు చేశాం. చంద్రబాబు హయాంలో అప్పుల్లో పెరుగుదల రేటు 19 శాతం. అప్పుడు ఆ రేటు కేవలం 15 శాతం మాత్రమే అని సీఎం జగన్ ప్రకటించారు. చంద్రబాబు హయాంలో పథకాలు ఎందుకు లేవో ప్రజలే ఆలోచించుకోవాలి. దోచుకో.. పంచుకో.. తినుకో ఇదే చంద్రబాబు విధానం అని సీఎం జగన్ ఎద్దేవా చేశారు.వైఎస్ఆర్‌సీపీ మేనిఫెస్టో ఆత్మ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమమే. గడప గడపకు నవరత్నాలు అందించడమే లక్ష్యం. ప్రతి గడపకు అందే సామాజిక న్యాయం, సాధికారతే నవరత్నాలు అని సీఎం జగన్ మరోసారి ప్రకటించారు.ఎస్సీల్లో ఎవరైనా పుడతారా? అని చంద్రబాబు హేళన చేశారు. కానీ, మన హయాంలో అన్ని వర్గాలను గుండెల్లో పెట్టుకున్నాం. ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధికారతకు కృషి చేశాం. ఎక్కడా అవినీతికి అవకాశం లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నాం అని సీఎం జగన్ చేశారు.2024 ఎన్నికలు ఖచ్చితంగా చంద్రబాబుకు చివరి ఎన్నికలే. మనమంతా మారీచులు, పెత్తందారులతో యుద్ధం చేయక తప్పదు. చంద్రబాబు, ఆయన బ్యాక్‌బోన్ ఎల్లో బ్రదర్స్, దత్తపుత్రుడు ఏ సామాజిక వర్గానికి ప్రతినిధులో ఆలోచన చేయాలి. పేదలకు ఇళ్లు ఇస్తామంటే కోర్టులో కేసు వేస్తారు వీళ్లు. పేదల శత్రువు, ఆయన పెత్తందారులు. వాళ్లకు ఏనాడూ మంచి బుద్ధి లేదు. వైఎస్ఆర్‌సీపీ సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనం. మానవతా వాదానికి వైఎస్ఆర్‌సీపీ ప్రతీక. నిజాయితీకి వెన్నుపోటుకు మధ్య యుద్ధం జరగబోతోంది. 2024లో ఇంతటికి మించిన గెలుపు ఖాయమని చెప్పండి అని బీసీ శ్రేణులను ఉద్దేశించి సీఎం జగన్ పిలుపు ఇచ్చారు.ప్రతి గడపకు వాస్తవ పరిస్థితిని తీసుకెళ్లాలి. మంచి జరిగితేనే జగనన్నకు తోడు ఉండండని చెప్పండి. చంద్రబాబు అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని చెప్పండి అని జయహో బీసీ మహాసభకు హాజరైన సుమారు 85 వేలమంది బీసీ ప్రజాప్రతినిధులను ఉద్దేశించి పేర్కొన్నారు.

# కొత్త ఎంపీల బాధను అర్థం చేసుకోండి: రాజకీయ పార్టీలకు మోదీ పిలుపు



దిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మరికొద్ది సేపట్లో ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా పార్లమెంట్‌కు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ..మీడియాతో మాట్లాడారు. జీ20కి భారత్ అధ్యక్షత వహించిన వేళ.. ఈ సమావేశాలు జరుగుతుండటం ప్రాధాన్యమని అన్నారు. చర్చలు సజావుగా సాగేందుకు సహకరించాలని ప్రధాని ప్రతిపక్షాలను కోరారు. కొత్త ఎంపీలకు సభలో అవకాశాలు కల్పించాలని అన్నారు."శీతాకాల సమావేశాలకు నేడు తొలి రోజు. ఈ ఏడాది ఆగస్టు 15తో స్వతంత్ర భారతావనికి 75 ఏళ్లు పూర్తయ్యాయి. ఇక మనముందు ఉన్నది ఆజాదీకా అమృత్ కాల్. జీ20 సదస్సుకు భారత్ అధ్యక్షత వహిస్తున్న వేళ.. ఈ పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ సమావేశంలో భారత్ ఘనమైన చోటు దక్కించుకుంటోంది. మన దేశంపై అంచనాలు పెరుగుతున్నాయి. ప్రపంచ వేదికలపై మన భాగస్వామ్యం పెరుగుతోంది. ఇప్పుడు జీ20 సదస్సుకు అధ్యక్షత వహించే అదృష్టం లభించింది. జీ20 కేవలం దౌత్య సమావేశం మాత్రమే కాదు. మన సామర్థ్యాన్ని ప్రపంచం ముందు ప్రదర్శించేందుకు వచ్చిన అద్భుత అవకాశం" అని మోదీ(ఓనీటతి) తెలిపారు.దేశాన్ని అభివృద్ధిలో ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడాన్ని దృష్టిలో ఉంచుకుని.. ఈ సమావేశాల్లో కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ప్రయత్నాలు జరగాలని మోదీ ఆకాంక్షించారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. ఈ చర్చలు సానుకూలంగా, ఫలప్రదంగా జరుగుతాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. "కొత్త ఎంపీలు, యువ సభ్యులకు చర్చల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని అన్ని రాజకీయ పార్టీల నేతలను కోరుతున్నా. ప్రజాస్వామ్య దేశంలో మరో తరాన్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనపై ఉంది. సభలకు ఆటంకం జరిగితే కొత్త ఎంపీలు మాట్లాడేందుకు అవకాశం ఉండదు. వారి బాధను అర్థం చేసుకోండి" అని ప్రధాని ఉభయ సభల సభ్యులను కోరారు.బుధవారం నుంచి ప్రారంభం కానున్న శీతాకాల సమావేశాలు ఈ నెల 29 వరకు కొనసాగుతాయి. మొత్తం 23 రోజుల వ్యవధిలో ఉభయ సభలు 17 దఫాలు భేటీకానున్నాయి. 16 కొత్త వాటితో సహా 25 బిల్లులకు పార్లమెంటు ఆమోదం పొందాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుండగా కీలకమైన మూడు బిల్లులను స్థాయీ సంఘం పరిశీలనకు పంపించాలని కాంగ్రెస్ పార్టీ పట్టుపడుతోంది.

# ఎన్ఆర్ఐ అకాడమీలో నగదు, పత్రాలు సీజ్ చేశాం: సోదాలపై ఈడీ ప్రకటన




అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఎన్ఆర్ఐ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఈనెల 2న జరిపిన తనిఖీలు, సోదాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రకటన విడుదల చేసింది.విజయవాడ, కాకినాడ, గుంటూరు, హైదరాబాద్‌లో జరిపిన సోదాల్లో కొంత నగదు, కీలక పత్రాలు సీజ్ చేసినట్లు వెల్లడించింది. పలువురు వ్యక్తులకు సంబంధించిన కీలక పత్రాలు కూడా అందులో ఉన్నట్లు పేర్కొంది. ఏపీ పోలీసులు నమోదు చేసిన మనీలాండరింగ్ కేసు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఈడీ ప్రకటనలో తెలిపింది."భవనాల నిర్మాణానికి, ఇతర అవసరాలకు ఎన్ఆర్ఐ సొసైటీకి చెందిన నిధులు మళ్లించారు. కొవిడ్ రోగుల నుంచి వసూలు చేసిన మొత్తానికి, సంస్థ చూపిస్తున్న లెక్కలకు పొంతన లేనట్లు గుర్తించాం. వైద్య విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు తేలింది. ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశాలకు.. అకౌంట్స్ బుక్స్‌లో పేర్కొన్న గణాంకాల కంటే ఎక్కువగా వసూలు చేసినట్లు గుర్తించాం. ఎన్ఆర్ఐఏఎస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో మరో కంపెనీని రూపొందించి దాని ద్వారా ఎన్ఆర్ఐ సొసైటీకి చెల్లించాల్సిన నిధులను మళ్లించారు. మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు అనుమానిస్తున్న స్థిరాస్తులకు చెందిన 53 డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నాం. వాటిని స్తంభింపజేశాం. నిధుల మళ్లింపుతో సంబంధం ఉన్న అనేక ఇతర నేరారోపణ పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నాం" అని ప్రకటనలో ఈడీ పేర్కొంది.

## వార్ జోన్‌లో అడుగుపెట్టాం.. కురుక్షేత్రానికి మేం సిద్ధమే: స్పీకర్ తమ్మినేని

విజయవాడ: రాష్ట్రంలోని బీసీ కులాల కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఛైర్మన్లను నియమిస్తే తెదేపా నేతలు హేళన చేస్తున్నారని ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్ అన్నారు.బీసీల ఓట్ల కోసం ఆ పార్టీ నేతలు ముసుగులు వేస్తూ వస్తున్నారని ఆక్షేపించారు. విజయవాడ లోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వైకాపా ఆధ్వర్యంలో 'జయహో బీసీ మహాసభ' నిర్వహించారు. ఈ సభకు బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ బీసీ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. "బీసీల కోసం సీఎం జగన్ నేరుగా బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు.

# తుపానుగా మారనున్న వాయుగుండం



విశాఖపట్టణం, డిసెంబర్ 7, వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఆగ్నేయంగా పయనిస్తోంది. సుమారు 22 కిలోమీటర్ల వేగంతో పయనిస్తోంది. ప్రస్తుతంతో చెన్నైకు 900 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. ఆగ్నేయంగా దూసుకొస్తున్న ఈ వాయుగుండం మరికొన్ని గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారనుంది. సాయంత్రానికి తుపానుగా రూపాంతరం చెందనుంది. గురువారం ఉదయాని కల్ల ఉత్తర తమిళనాడు, పుదిచ్చేరీ, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలను తాకనుంది. తుపాను ప్రభావంతో చాలా ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం అతి భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తుపాను తీరం దాటే శుక్రవారం మాత్రం వర్షాలు దంచికొట్టను న్నాయి. ముఖ్యంగా తమిళనాడుపై తీవ్ర ప్రభావం చూపనుంది. అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. దక్షిణ ఆంధ్రప్రదేశ్‌తోపాటు రాయలసీమలో కూడా వర్షాలు కుమ్మేయనున్నాయి. శనివారానికి వర్షాలు, గాలుల ప్రభావం తగ్గిపోనుంది. సీమ, దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఆ రోజు సాయంత్రానికి పరిస్థితి నార్మల్ అయ్యే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రెండు రోజుల పాటు ఈ తుపాను కొమసాగనుంది. గురువారం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అరవై నుంచి వంద కిలోమీటర్ల వేగంతో గాలులు వీయనున్నాయి. శుక్రవారం నాటికి గాలులు కాస్త తగ్గుముఖం పట్టనున్నాయి. రెండు రోజుల పాటు తీవ్ర ప్రభావాన్ని చూపిన అనంతరం పదో తేదీ ఉదయానికి తుపాను వాయుగుండంగా మారిపోనుంది. శనివారం ఉదయం కూడా గాలుల ప్రభావం అదే స్థాయిలో ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. పదో తేదీ ఉదయం వరకు సముద్రం అల్లకల్లోంగా ఉంటుందని జాలర్లు వేటకు వెళ్లకోపోవడవే మంచిదని వాతావరణ శాఖ సూచిస్తోంది. తీర ప్రాంతాల్లో ఉంటున్న మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం మంచిదని చెబుతున్నారు.

కోస్తా తమిళనాడు, పుదుచ్చేరి, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో ఆస్తి నష్టం జరిగే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

పూరి గుడిసెలకు నష్టం. ఇంటిపై వేసిన మెటల్ షీట్లు ఎగిరిపోవచ్చు.

విద్యుత్, కమ్యూనికేషన్ లైన్లకు స్వల్ప నష్టం.

కచ్చా, పక్కా రోడ్లకు కొంత నష్టం.

చెట్ల కొమ్మలు విరగడం, చెట్లు పెకిలించడం.

అరటి , బొప్పాయి చెట్లకు, తీరప్రాంత వ్యవసాయానికి నష్టం. వరి, ఇతర పంటలకు నష్టం.

భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలలో వరదలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగవచ్చు.

కోస్టల్ తమిళనాడు, పుదుచ్చేరి, ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా ఆంధ్ర ప్రదేశ్‌లో తీసుకోవాల్సిన చర్యలు

ఏడో తేదీ నుంచి పదో తేదీ వరకు ఫిషింగ్ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయడం

7-10 డిసెంబర్ సమయంలో ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ కార్యకలాపాలను నియంత్రణ

ప్రజలు బయటికి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచన

# వైఎస్సార్‌సీపీ నేత హత్యపై సీఎం జగన్ ఆరా.. ధర్మానకు కీలక ఆదేశాలు

అమరావతి: శ్రీకాకుళం జిల్లా గార మండలం ఉపాధ్యక్షులు బరాటం రామశేషు హత్యఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు.తక్షణమే గ్రామానికి వెళ్లి ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకోవడంతో పాటు రామశేషు కుటుంబానికి అండగా నిలబడాలని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును సీఎం ఆదేశించారు.దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడలో నిర్వహిస్తున్న బీసీ సదస్సుకు హాజరు కాకుండానే.. పార్టీకి ఎన్నో సేవలందించి హత్యకు గురైన రామశేషు కుటుంబాన్ని పరామర్శించడానికి రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు వెళ్లారు.కాగా, గార మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రామశేషు స్థానికంగా పలు వ్యాపారాలు చేస్తున్నారు. గతంలో ఈ గ్రామంలో మూడు దఫాలు సర్పంచ్‌గా కూడా పనిచేశారు. అయితే, పలు వ్యాపారాలు చేస్తున్న క్రమంలో కొందరు వ్యక్తులు ఆరేళ్ల క్రితం కూడా రామశేషుపై దాడి చేశారు. ఆ సమయంలో తీవ్రగాయాలు కాగా కోలుకున్నారు. అయితే, మంగళవారం ఉదయం తన గోడౌన్‌కు స్టాక్ వచ్చిందని ఫోన్ రావడంతో రామశేషు అక్కడికి బయలుదేరారు.ఈ క్రమంలో రోడ్డు మీద కాపుకాసిన గుర్తు తెలియని వ్యక్తులు అతడిని దారుణంగా హత్య చేశారు. తలపై బండిరాయితో కొట్టడంతో రక్తపు మడుగులో అక్కడికక్కమే మృతిచెందాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.



# నోట్ల రద్దుపై రికార్డులు సమర్పించండి.. కేంద్రం, ఆర్‌బీఐకి సుప్రీం ఆదేశాలు

దిల్లీ: ఆరేళ్ల క్రితం నాటి నోట్ల రద్దు ను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ ముగించింది.రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేస్తూ 2016లో తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన అన్ని రికార్డులను సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ ఖీఃఐ)ను ఆదేశించింది. అనంతరం ఈ పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. దీనికి అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి స్పందిస్తూ.. సంబంధిత రికార్డులను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తానని తెలిపారు.2016 నవంబరు 8న రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో 58 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ ఎస్ఏ నజీర్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కొంతకాలంగా విచారణ జరిపింది. అయితే నోట్ల రద్దు నిర్ణయంపై న్యాయ సమీక్ష అవసరం లేదని గత విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వాదించింది. 'కేవలం నల్లధనం కోణంలోనే కాకుండా, విస్తృత కోణంలో నాటి నిర్ణయాన్ని చూడాలి. ఏదైనా పనిలో ఒక వ్యక్తి విఫలమైనంత మాత్రాన.. ఆయన ఉద్దేశం లోపభూయిష్టమైనదని చెప్పడం సరికాదు" అని కేంద్రం తరఫున ఏజీ పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్‌లో పెట్టింది.



# సంపాదకీయం

గురువారం 08-12-2022

## ఎన్నికల ఫీవర్ షురూ

సార్వత్రిక ఎన్నికలు ఇంకా ఏణ్ణార్థం సమయం ఉంది. అయినా దేశం మొత్తం ఎలక్షన్ ఫీవర్ కనిపిస్తోంది. అన్ని ప్రధాన రాజకీయ పార్టీలూ ఎన్నికల మూడ్ లోనే ఉన్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, విపక్ష కాంగ్రెస్ సహా అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలూ కూడా ఎన్నికల సన్నాహాలలో నిండా నిమగ్నమయ్యాయి. అంతేనా.. ఇప్పటి నుంచే వ్యూహ ప్రతివ్యూహాలు, విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయ వేడి చల్లారకుండా రగులుస్తూనే ఉన్నాయి. ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా ప్రత్యర్థి పార్టల నుంచి జంప్ జిలానీలను ప్రోత్సహించడమే కాదు.. పార్టీకి గ్లామర్ కోసం సెలబ్రిటీలనూ ఆశ్రయిస్తున్నాయి.కేవలం సెలబ్రిటీలు పార్టీ తరఫున మాట్లాడితే ఓట్లు పడతాయా అన్న సంశయం ఉన్నప్పటికీ.. వారి వల్ల తమ సభలకు జనం తరలివస్తారన్న నమ్మకం మాత్రం అన్ని పార్టీలలోనూ మెండుగా ఉంది. అమిత్ షా హైదరాబాద్ పర్యటనల సందర్భంగా ప్రముఖ సినీ నటులతో ప్రత్యేకంగా భేటీ కావడం, రాహుల్ గాంధీ భాతర్ జోడో యాత్రలో ప్రముఖ నటులు కలిసి నడవడం వంటి గిమ్మిక్కులన్నీ ఇందులో భాగమనే చెప్పాల్సి ఉంటుంది. నిజంగానే సినీ గ్లామర్ ఓట్లను రాలుస్తుందా? అంటే నమ్మకంగా ఏ పార్టీ ఔనని చెప్పగలిగే పరిస్థితి లేదు. ఎందుకంటే తమిళనాడులో, ఆంధ్రప్రదేశ్ లో అత్యంత ప్రజాదరణ ఉన్న నటులు సొంతంగా పార్టీ ఏర్పాటు చేసి విజయం సాధించడంలో విఫలమైన ఉదంతాలు ఉన్నాయి. అయితే సినీ గ్లామర్ ఆయా పార్టీల ర్యాలీలకు జనాన్ని రప్పించడానికి మాత్రం ఖచ్చితంగా ఉపయోగపడుతుందన్న విశ్వాసం మాత్రం ఆయా పార్టీల నాయకుల్లో మెండుగా ఉంది. అందుకే పోటీలు పడి మరీ సెలబ్రిటీలకు పార్టీల నేతలు ఆహ్వానాలు పలుకుతున్నారు. ఈ ఎన్నికల రేసును ముందుగా మొదలు పెట్టినది బీజేపీ అనే చెప్పాలి. హిమాచల్, గుజరాత్ ఎన్నికలు ముగిశాయి. మరో మూడు రోజులలో ఫలితాలు వస్తాయి. గుజరాత్ లో రెండో విడత పోలింగ్ ఇంకా పూర్తిగా ముగియక ముందే.. త్వరలో అంటే వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలపై దృష్టి సారించాలంటూ ప్రధాని మోడీ బీజేపీ క్యాడర్ కు పిలుపు నిచ్చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో అవలంబించాల్సిన వ్యూహాలపై బీజేపీ అధ్యక్షుడు నడ్డా పార్టీ శ్రేణులకు వివరిస్తారు. ఎన్నికలలో అనుసరించాల్సిన ప్రచారంపై దిశానిర్దేశం చేస్తారు.ఒక్క మాటలో చెప్పాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికలకు రోడ్ మ్యాప్ పై ఆ సమావేశాల్లో చర్చిస్తారు సార్వత్రిక ఎన్నికలే కాకుండా వచ్చే ఏడాది అంటే 2023లో కర్నాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగే ఎన్నికలపై ఇప్పటి నుంచే సీరియస్ గా దృష్టి పెట్టాలని మోడీ క్యాడర్ కు పిలుపు నిచ్చేశారు. అంతే కాకుండా తెలుగు రాష్ట్రాలు ఏపీ, తెలంగాణ అసెంబ్లీలకు కూడా ముందస్తు ఎన్నికలు వచ్చే ఏడాదే జరిగే అవకాశాలున్నాయన్న సంకేతాలు కూడా ఇచ్చారు.రెండు రోజుల బీజేపీ జాతీయఆఫీస్ బేరర్స్, అన్ని రాష్ట్రాల ఇంఛార్జులు, కో-ఇన్-ఛార్జులు, ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీలతో రెండు రోజుల పాటు జరిగే సమావేశాల నడ్డా ప్రసంగించారు. మోడీ వర్చువల్ గా పాల్గొన్నారు. అటు గుజరాత్ ఎన్నికల రెండో విడత పోలింగ్ పూర్తి కాకముందే బీజేపీ తదుపరి కార్యాచరణకు శ్రీకారం చుట్టేసింది. బీజేపీ తన స్పీడ్ తో ఇరత పార్టీలలో కూడా ఎన్నికల వేడిని రగిలించేసింది. బీజేపీహంగామాతో ఇతర పార్టీలు సైతం ఎన్నికలసన్నాహాలకు శ్రీకారం చుట్టేశాయి. ఇక అన్నిటికీ మించి కేంద్రం బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలలో దర్యాప్తు సంస్థల ద్వారా ఆ ప్రభుత్వాలకు చిక్కులు సృష్టిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. దర్యాప్తు సంస్థల దాడులతో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలను టెన్షన్ లోకి నెట్టేసి తాను మాత్రం ఎన్నికల సన్నాహాలను తాపీగా చేసుకుంటోందని రాజకీయ పరిశీలకులు విశ్లేషణలు చేస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ముందు వరుసగా రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలు ఉండటంతో దేశ వ్యాప్తంగా ఎలక్షన్ ఫీవర్ పీక్స్ లో ఉంది.

# బీజేపీ స్నేహ హస్తం ఇచ్చినట్టేనా

విజయవాడ, డిసెంబర్ 7, మోడీతో చంద్రబాబు మాటామంతీ. పొత్తుకు సంకేతాలిచ్చినట్లేనంటూ టీడీపీ శ్రేణుల్లో ఆసక్తిని రేకెత్తించింది. వాస్తవంగా కేంద్రంలోని బీజేపీ పెద్దల ఎత్తుగడ వేరు. రాష్ట్రంలోని అన్ని పార్టీలతోనూ తత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. వైసీపీ సర్కారుకు తెర వెనుక నుంచి సాయం చేస్తున్నారు. జనసేనతో పొత్తు పెట్టుకున్నారు. అప్పుడప్పుడూ టీడీపీ అధినేత చంద్రబాబును పలకరిస్తుంటారు. మీకు మేం దూరంగా లేమనే సంకేతాలు ఇస్తుంటారు. ఎన్నికల నాటికి తగు నిర్ణయం తీసుకుంటారు. ఏపీలో బీజేపీ బలమెంతో అధిష్టానానికి తెలుసు. అందుకే ఇలాంటి వ్యూహంతో మూడు పార్టీలతో సంబంధాలు కొనసాగిస్తుంటారు. మోడీతో మాట కలిపినంత మాత్రాన పొత్తులపై ఆశ పెట్టుకోవడంలో అర్థం లేదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.జీ-20 భాగస్వామ్య దేశాల సదస్సుకు మనదేశం ఆతిథ్యమిస్తోంది. సదస్సు నిర్వహణ కోసం ప్రధాని మోడీ ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి అన్ని రాజకీయ పక్షాల అధినేతలు హాజరయ్యారు. రాష్ట్రం నుంచి సీఎం జగన్‌తోపాటు ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సమావేశంలో చంద్రబాబు ప్రస్తావించిన డిజిటల్? నాలెడ్జ్?అంశాన్ని ప్రధాని మోడీ ప్రస్తావించడం యాధృచ్ఛికం కావొచ్చు. టీడీపీకి పొత్తులపై ఆశలు పెంచడానికి అయ్యుండొచ్చు. లేదా సీఎం జగన్‌ను మరికొన్ని అంశాల్లో మెడలు వంచడానికి ఎత్తుగడ అనుకోవచ్చు.చంద్రబాబు ఢిల్లీ బయల్దేరిన దగ్గర నుంచి టీడీపీ శ్రేణుల్లో ఒకటే ఉత్కంఠ. ప్రధాని మోడీ నుంచి సానుకూల సంకేతాలు వస్తాయని గంపెడాశలు పెట్టుకున్నారు. వాళ్లు ఆశించినట్లే సదస్సులో చంద్రబాబు ప్రసంగంలోని అంశాన్ని మోడీ ప్రస్తావించారు. ఇంకా చంద్రబాబు పలువురు కేంద్ర మంత్రులతో మాటలు కలిపారు. ఇవన్నీ బీజేపీ స్నేహ హస్తం అందిస్తుందనే దానికి సంకేతాలని తమ్ముళ్లు భావిస్తున్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తే 2014 ఎన్నికల మాదిరిగా విజయతీరాలను చేరుకోవచ్చనే ఆశతో ఉన్నారు.మరోవైపున టీడీపీలో కొందరు బీజేపీ పట్ల పార్టీ సానుకూలంగా వ్యవహరించడాన్ని సహించలేకపోతున్నారు. ఇక్కడ బీజేపీని వ్యతిరేకించకుండా కేవలం వైసీపీ మీదనే గురి పెడితే పార్టీకి ఆశించిన మేర ప్రజల మద్దతును కూడగట్టలేమని భావిస్తున్నారు. విశాఖ స్టీల్?ప్లాంటు నుంచి పోలవరం ప్రాజెక్టు దాకా కేంద్ర వైఖరిని నిలేయకుండా వైసీపీని టార్గెట్ చేయడం ద్వారా టీడీపీ పుంజుకునే అవకాశం లేదంటున్నారు. ప్రత్యేక హోదా, కడప ఉక్కు కర్మాగారం, రామాయపట్నం పోర్టును ఇవ్వకుండా కేంద్ర సర్కారు మోసం చేసిందనే భావన ప్రజల్లో బలంగా నాటుకుంది. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచేసి సామాన్యుల నడ్డి విరుస్తుందని సగటు ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. నిత్యావసరాలపై కూడా జీఎస్టీ పన్ను వేయడంపై జనం బీజేపీ అంటనే కన్నెర్రజేస్తున్నారు.ఇలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వ దురాగతాన్ని ప్రశ్నించకుండా కేవలం వైసీపీని తిట్టిపోసినా ఆశించిన ప్రయోజనం దక్కదని మదనపడుతున్నారు. బీజేపీ, వైసీపీని ఒకేగాటన కట్టకుండా పార్టీకి పూర్వ వైభవం రాదని ఒకటే ఇదైపోతున్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టడంతోపాటు త్వరలో ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్లను గృహాలకూ బిగించనున్నారు. పోర్టులతోపాటు థర్మల్?విద్యుత్? కేంద్రాలనూ అదానీ పరం చేయడానికి వైసీపీ సర్కారు సిద్ధమవుతోంది. ఈ తరుణంలో కేంద్రంలోని బీజేపీని టార్గెట్?చేయకుంటే పార్టీకి మైలేజీ రాదని తెగ బాధపడిపోతున్నారు. మరి వీళ్ల అభిప్రాయాలను చంద్రబాబు పరిగణనలోకి తీసుకుంటారా! లేక పొత్తు ఆశల పల్లకిలో విహరిస్తారా అనే దానిపై టీడీపీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది.ఇక హస్తినలో వరుస భేటీలుతెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఢిల్లీలోనే ఉన్నారు. నిన్న జీ 20 సన్నాహక సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లిన చంద్రబాబు ఈరోజు కూడా ఢిల్లీలోనే ఉన్నారు. అయితే ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాలను కలిసే అవకాశాలున్నాయని వార్తలు వచ్చాయి. కానీ చంద్రబాబు కూడా వారి అపాయింట్‌మెంట్ కోసం ఎలాంటి ప్రయత్నం చేయలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ అపాయింట్ మెంట్ కోరినా వారు ఇవ్వలేదా? ఈయన అడగలేదా? అన్నది తెలియకున్నా ప్రస్తుతం చంద్రబాబు మాత్రం మీడియా మిత్రులతో బిజీగా ఉన్నారని తెలిసింది. జీ 20 సన్నాహక సమావేశంలో పాల్గొన్న అనంతరం చంద్రబాబు పలువురు జాతీయ మీడియా ప్రతినిధులతో సమావేశమయ్యారని తెలిసింది.

వారితో ఆయన డిన్నర్ చేస్తూ పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. ఈసారి ఆంధ్రప్రదేశ్ లో ఖచ్చితంగా తెలుగుదేశం పార్టీ 150 స్థానాల్లో విజయం సాధిస్తుందని చంద్రబాబు జాతీయ మీడియా ప్రతినిధులతో అన్నారని తెలిసింది. లోకేష్ పాదయాత్ర గురించి కూడా ఆయన వారి ఎదుట ప్రస్తావించారట. ఎంపిక చేసుకున్న కొన్ని మీడియా ప్రతినిధులతోనే ఆయన డిన్నర్ మీటింగ్ ఏర్పాటు చేసుకున్నారని తెలిసింది. చంద్రబాబు తన ఇంటికి తెలుగు మీడియా ప్రతినిధులను లంచ్ కు ఆహ్వానించారు. తెలుగు మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేస్తున్నారు. కర్నూలు, పశ్చిమ గోదావరి జిల్లాలో తన పర్యటనకు లభించిన ఆదరణతో పాటు రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు పట్టం కట్టడానికి రెడీగా ఉన్నారని ఆయన మీడియా మిత్రులతో అన్నట్లు చెబుతున్నారు. జగన్ ప్రభుత్వంపై అసంతృప్తి బాగా జనాల్లో ఉందని, ఈసారి తమ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం.

# సైకిల్ లో ఫుల్ జోష్



కడప, డిసెంబర్ 7, తెలుగుదేశం పార్టీ కడప జిల్లాలో చాలా మంది హ్యాపీగా ఉన్నారట. దీనికి కారణం గత ఎన్నికలకు ముందు పరిస్థితులు పార్టీలో లేకపోవడమేనని అంటున్నారు. గత ఎన్నికల్లో టిక్కెట్లు రాక అనేక మంది నిరుత్సాహానికి గురయ్యారు. ఐదేళ్లు పడిన శ్రమ అంతా వృధా అయిందని సీనియర్ నేతలు కూడా బాధపడి పార్టీ కార్యక్రమాలకు కొంత దూరంగా ఉన్నారు. తమకు టిక్కెట్లు రాకపోవడానికి ప్రధానమైన నేత ఇప్పుడు లేకపోవడంతో ఈసారైనా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చన్న భావనలో కడప జిల్లాలో టీడీపీ నేతలు ఉన్నారు. 2019 ఎన్నికలకు ముందు కడప జిల్లాకు ఎవరు పార్టీ అధ్యక్షుడిగా ఉండనీ, ఆదినారాయణ రెడ్డి మంత్రిగా ఉండనీ.. కథ నడిపింది మొత్తం రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ మాత్రమే. ఆయన సూచించిన వారికే ఎక్కువ మందికి జిల్లాలోని నియోజకవర్గాల్లో టిక్కెట్ ను అధిష్టానం కేటాయించిందన్నది అందరూ అంగీకరిస్తున్నారు. సీఎం రమేష్ ఆర్థికంగా పార్టీని ఆదుకున్నందున ఆయన మాటకు హైకమాండ్ కూడా విలువిచ్చింది. రాజ్యసభ సభ్యుడిగా జిల్లాలో పట్టు పెంచుకునేందుకు సీఎం రమేష్ తన వారికి టిక్కెట్లు ఇప్పించుకునే ప్రయత్నం చేశారంటున్నారు. చంద్రబాబు కూడా సీఎం రమేష్ అంటే కొంత సానుకూలత ఉండటంతో ఆయన చెప్పిన వారికే టిక్కెట్లు ఇచ్చారంటారు. అందులో భాగంగానే జమ్మలమడుగులో ఆదినారాయణ రెడ్డిని కడప పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేయించాలని ప్రతిపదించింది కూడా సీఎం రమేష్ మాత్రమేనట. మళ్లీ అధికారంలోకి వస్తే ఆదినారాయణరెడ్డి మంత్రి పదవి కోరతారని, తన అనుచరుడికి మంత్రి పదవి ఇప్పించుకోవడానికి ఆయన ఈ ప్రతిపాదనను తెచ్చినట్లు చెబుతున్నారు. ఎంపీ ఎన్నికకు అయ్యే ఖర్చు కూడా తానే భరిస్తానని ఆయన చెప్పడంతో జమ్మలమడుగు టిక్కెట్ ను ఆయనను కాదని రామసుబ్బారెడ్డికి ఇచ్చారంటారు. తీరా ఎన్నికల ఫలితాల తర్వాత రామసుబ్బారెడ్డి వైసీపీలో చేరిపోగా, ఆదినారాయణ రెడ్డి బీజేపీ పంచన చేరారు. ఇక ప్రొద్దుటూరు టిక్కెట్ విషయానికొస్తే అక్కడ నంద్యాల వరదరాజులు రెడ్డి టిక్కెట్ కోసం చాలా ప్రయత్నించారు. కానీ ఆయనకు దక్కకుండా మల్లెల లింగారెడ్డికి టిక్కెట్ దక్కడంలో అప్పుడు సీఎం రమేష్ ప్రధాన పాత్ర పోషించారంటారు. అందుకే అప్పట్లో వరదరాజులురెడ్డి సీఎం రమేష్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు కూడా బహిరంగంగానే చేశారు. అయితే ఈసారి ఎన్నికల నాటికి సీఎం రమేష్ పార్టీలో లేకపోవడంతో జిల్లా నేతలు కొంత ఊపిరిపీల్చుకున్నారని తెలిసింది. సర్వే ప్రకారమే టిక్కెట్ లు అధిష్టానం ఇస్తే మంచిదేనని, కేవలం డబ్బులు పెడతారని, అంతమాత్రాన బలహీనమైన వ్యక్తులను సిఫార్సు చేసి గత ఎన్నికల్లో పది పదికి స్థానాలను వైసీపీకి అప్పగించేలా చేశారన్న కామెంట్స్ వినిపించాయి. ఇప్పుడు ఆయన బాధ లేకపోవడంతో టీడీపీ నేతలు ఊపిరి పీల్చుకుంటున్నారట. గెలుపు గుర్రాలకే ఈసారి టిక్కెట్లు వస్తాయని, పార్టీకి జిల్లాలో పట్టు లభిస్తుందని భావిస్తున్నారట.

# ఆనంకు ప్రమోషన్ ...



నెల్లూరు, డిసెంబర్ 7, ఆనం రామనారాయణరెడ్డి ఈసారి ఎక్కడి నుంచి పోటీ చేస్తారు? అసలు వైసీపీ నుంచి పోటీ చేస్తారా? చేస్తే ఏ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతారు? లాంటి ప్రశ్నలు వైసీ?పీ క్యాడర్ లో వ్యక్తమవుతుంది. వైసీపీ అధినాయకత్వం కూడా ఆనం విషయంలో ఒక నిర్ణయానికి వచ్చినట్లే కనపడుతుంది. ఆయనను ఈసారి అసెంబ్లీ బరి నుంచి పక్కకు తప్పించాలన్న యోచనలో ఉందని పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. సీనియర్లను వీలయినంత మేరకు పక్కన పెట్టి కొత్త వారికి అవకాశమివ్వాలన్న ఉద్దేశ్యంతో వైసీపీ అధినేత జగన్ కూడా ఉన్నారని చెబుతున్నారు. ఆనం కుటుంబానికి నెల్లూరు, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో పట్టుంది. ప్రస్తుతం ఆయన వెంకటగిరి నియోజకవర్గం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. 2014లో టీడీపీలో చేరిన ఆనం రామనారాయణరెడ్డి అక్కడ ఏ పదవులు రాకపోవడంతో 2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిపోయారు. ఆత్మకూరు నియోజకవర్గం కోరుకున్నా అక్కడ మేకపాటి కుటుంబం ఉండటంతో చివరకు వెంకటగిరి టిక్కెట్ ను జగన్ ఆనం రామనారాయణరెడ్డికి కేటాయించారు. అయితే వెంకటగిరి పై ఆసక్తి లేకపోయినా పోటీ చేసి గెలిచిన ఆనం రామనారాయణరెడ్డి అక్కడ పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడం లేదంటున్నారు. నేదురుమిల్లి రామ్ కుమార్ రెడ్డి అక్కడ కీలక నేతగా ఎదుగుతున్నారు. ఆయనకు హైకమాండ్ అన్ని రకాలుగా మద్దతుగా నిలుస్తుందన్న అనుమానం పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో రామ్ కుమార్ రెడ్డికే వెంకటగిరి టిక్కెట్ ఇస్తారన్న ప్రచారం జరుగుతుంది. ఆత్మకూరు మళ్లీ మేకపాటి కుటుంబానికే దక్కుతుంది. దీంతో ఆనం రామనారాయణరెడ్డి అంగీకరిస్తే ఆయనను నెల్లూరు పార్లమెంటుకు పోటీ చేయించాలని భావిస్తుంది. ఆదాల ప్రభాకర్ రెడ్డిని పక్కన పెట్టి ఆనంకు నెల్లూరు ఎంపీ టిక్కెట్ ఇవ్వాలన్న ఆలోచనలో ఉందని విశ్వసనీయ సమాచారం. అయితే ఆనం రామనారాయణరెడ్డి తనకు మంత్రి వర్గంలో స్థానం దక్కుతుందని భావించారు. రెండో సారి కూడా ఆనంకు ఆశాభంగమే ఎదురయింది. మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి వైసీపీలో గెలిచినా తనకు మంత్రి పదవి వస్తుందన్న నమ్మకం లేదు. టీడీపీలోకి వెళ్లినా అక్కడ సోమిరెడ్డి వంటి సీనియర్ నేతలున్నారు. అందుకే అధినాయకత్వం ఎంపీగా పోటీ చేయమన్నా చేయక తప్పదన్న ఆలోచన ఒకవైపు.. ఈ పార్టీలో ఉంటే ఎదగలేమన్నది మరో వైపు ఎటూ తేల్చుకోలేక పోతున్నారట. అందుకే రెండు రోజుల క్రితం ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశమయ్యాయి.

# ఏపీలో 18 వేల 267 కిలోల డ్రగ్స్

విశాఖపట్టణం, డిసెంబర్ 7,ఆంధ్రప్రదేశ్ అక్షర క్రమంలోనే ముందు కనిపిస్తోంది. కింది నుంచి మొదటి స్థానం కోసం బీహార్ వంటి రాష్ట్రాలలో పోటీ పడుతోంది. అయితే ఒక్క విషయంలో మాత్రం ఏపీ దేశంలో మిగతా ఏ రాష్ట్రమూ కనీసం పోటీ కూడా పడలేనంత పురోభివృద్ధి సాధించింది. అయితే ప్రభుత్వం మాత్రం ఎందుకో ఈ అభివృద్ధిని ప్రచారం చేసుకోవడం లేదు సరికదా.. కనీసం తలచుకోవడానికి కూడా ఇష్టపడటం లేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వమే ఏపీ సాధించిన పురోభివృద్ధిని బట్టబయలు చేసింది. కేంద్ర విత్త మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని తాజాగా విడుదల చేసిన స్మగ్లింగ్ ఇన్ ఇండియా నివేదికలో చెప్పారు. స్మగ్లింగ్ ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి స్మగ్లింగ్ లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఫస్ట్ ప్లేస్ లో నిలిచింది. సాధారణంగా డ్రగ్స్ అనగానే ఎవరికైనా గోవా గుర్తుకు వస్తుంది. ఎందుకంటే అది ఇంటర్నేషనల్ టూరిస్ట్ డెస్టినేష్. ఇక్కడికి దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తారు. అందుకని సహజంగానే డ్రగ్స్ విషయంలో గోవా ఫస్ట్ ప్లేస్ లో ఉండేది. అక్కడా డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది.ఆంధ్రప్రదేశ్ మాత్రం ఈ మూడేళ్లలో స్మగ్లింగ్ విషయంలో గోవాను మించిపోయింది. స్మగ్లింగ్ ఇన్ ఇండియా నివేదిక ప్రకారం 2021-22 దేశం మొత్తంలోనే అత్యధికంగా 18, 267 కిలోల డ్రగ్స్ స్వీధీనం అయ్యాయి. ఇది దొరికిన డ్రగ్స్ మాత్రమే. దొరకకుండా రాష్ట్రం ఎల్లలు దాటిపోయినా, లేదా రాష్ట్రంలోని యువత వినియోగించేసిన మాదక ద్రవ్యాల సంగతేమిటనే ప్రశ్నకు ఎవరూ బదులు చెప్పలేరు. మొత్తం మీద కేంద్ర ఆర్థిక శాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం డ్రగ్స్ సంబంధిత కేసుల్లో ఏపీలో 90 మందిని అరెస్టు చేశారు. తొలి స్థానంలో ఉన్న ఏపీలో ఏకంగా 18 వేల 267 కిలోల డ్రగ్స్ స్వాధీనమైతే, పొరుగున ఉన్న తెలంగాణలో 2021-22లో స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ కేవలం 830 కిలోలు మాత్రమే. దీనిని బట్టే డ్రగ్స్ వ్యవహారంలో ఏపీ సాధించిన పురోగతి ఎంత ఘనంగా ఉందో ఇట్టే చెప్పేయవచ్చు. అక్కడితో ఆగిపోలేదే.. ఆ నివేదిక ప్రకారం దేశంలో ఎక్కడ డ్రగ్స్ పట్టుబడినా అందుకు సంబంధించిన లింకులు ఏపీలో ఉంటున్నాయి.ఇక గంజాయి విషయానికి వస్తే ఏపీలోని విశాఖ మన్యం ప్రాంతం నుంచి హస్తిన వరకూ గంజాయి స్మగ్లింగ్ సాగుతోంది. పలు సందర్భాలలో పెద్ద ఎత్తున పట్టుబడి గంజాయి స్మగ్లింగ్ వాహనాలన్నీ ఇదే విషయాన్ని అప్పట్లోనే తేటతెల్లం చేశాయి. దాదాపు అన్ని రాష్ట్రాల పోలీసులూ కూడా తమ రాష్ట్రానికి గంజాయి ఏపీ నుంచే వస్తోందని నిర్ధారించేశారు. మరి ఇంకా జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాలలోనే అధోగతికి చేర్చాశారనే అందామా.. లేక అన్ని విధాలుగానూ రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన జగన్ పాలన ఒక్క డ్రగ్స్, గంజాయి స్మగ్లింగ్ వ్యవహారంలో మాత్రం దేశంలోని మరే ఇతర రాష్ట్రం అందుకోలేనంత ఎత్తున నిలబెట్టాడని చెప్పుకుందామా?

## శ్రీకృష్ణదేవరాయలో లా కోర్సులకు మంగళం

అనంతపురం, డిసెంబర్ 7, అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో 2022-23 విద్యాసంవత్సరం నుంచి లా అడ్మిషన్లను నిలిపివేసేందుకు భారీ కుట్ర జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే వర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మయ్య ఉన్నత విద్యామండలికి వర్సిటీ లేఖ రాశారు. డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించనున్న లాసెట్ కౌన్సెలింగ్‌లో తమ యూనివర్సిటీ పేరును మినహాయించాలని కోరారు. లా కోర్సుల్లో బోధనకు తగినంత మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లులేరని.. ఎల్ఎల్‌బీ కోర్సు నిర్వహించలేమని, ప్రవేశాలు వెంటనే నిలిపివేయాలని డిసెంబరు 1న ఉన్నత విద్యామండలికి పంపిన లేఖలో ఆయన పేర్కొన్నారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు నిర్వహణ సాధ్యంకానందున, రెండేళ్ల ఎల్ఎల్ఎమ్ (మాస్టర్ ఆఫ్ లా కోర్సు) కోర్సును మాత్రమే కొనసాగిస్తామని, ప్రస్తుతం ఉన్న ఇద్దరు ఫ్యాకల్టీలో ఒకరు మెడికల్ లీవ్‌లో ఉన్నారని, అందువల్లనే మూడేళ్ల లా కోర్సులు నిర్వహించలేమని ఆ లేఖలో వివరించారు.ఐతే యూనివర్సిటీ విద్యార్థుల వాదన మరోలా ఉంది. ఈ యూనివర్సిటీలో అవినీతి, అక్రమాలు భారీ మొత్తంలో చోటుచేసుకుంటున్నాయని, వీటిపై లా స్టూడెంట్స్ ప్రశ్నించడంతో కక్ష్య సాధింపు కింద కోర్సును రద్దు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కి పెట్టడానికే వర్సిటీ అధికారులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. పైగా 'లా' విభాగంలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌తోపాటు, 8 తాత్కాలిక ఫ్యాకల్టీ కూడా ఉన్నారని, ఇంతమంది ఉన్నా కోర్సు నిర్వహించలేమని చెప్పడం విడ్డూరంగా ఉందని అంటున్నారు.నిజంగా ఫ్యాకల్టీ కొరత ఉన్న కోర్సులను మూసివేయవల్సి వస్తే ఇతర డిపార్ట్‌మెంట్లలో ఎన్నో కోర్సులు మూసివేయాల్సి ఉంటుందని, యూనివర్సిటీలో లా కోర్సు ప్రవేశాలకు రూ. 5,000 ఫీజు చెల్లిస్తే సరిపోతుంది.

## ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో..సిరివెళ్ల గ్రామంలో రైతుల వరి పంట దిగుబడిని పర్యవేక్షణ...

శిరివెళ్ళ డిసెంబర్ 07 ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సిరివెళ్ల మండలం సిరివెళ్ల గ్రామంలో సన్నకారు రైతులను వరి పంటను సందర్శించడం జరిగినది. రైతు గత మూడు నెలల సాగు చేసినటువంటి వరి ధాన్యానికి పెట్టుబడి ఖర్చు. తాను పొలంలోక్ నాటు వేసి ఒక ఎకరానికి 16000 చెప్పు వరకు.. ఎరువులు నీళ్ల మందులు ఖర్చు. పదహారు వేల రూపాయల వరకు ఖర్చు వస్తుంది. మరి ఈరోజు పంట దిగుబడి వచ్చేసి ఒక ఎకరానికి 30 నుంచి 40 లోపు చొప్పున వస్తున్నాయి.. మార్కెట్ ధర చూస్తే, అక్కడ ఉన్నటువంటి రైతు భరోసా కేంద్రాలలో అధికారులు చెప్పడం. ఒక బస్తా వచ్చేసి. 2040. చొప్పున కొనుగోలు చేస్తున్నాం. చెప్పడం జరిగిన అధికారులు. కానీ రైతుల పండించిన పంటను దాదాపు 15 నుంచి 30 రోజుల లోపు. డబ్బులు వస్తున్నాయని చెప్పడం జరిగినది. అందువలన,వరి దానాన్ని ప్రైవేటు వ్యాపారస్తులకు. రైతులు ముగ్గుచూపుతున్నారు. కావున ప్రైవేటు వ్యాపారస్తులు. 78 కేజీలు బస్తా పట్టి గోనసంచి రైతుల పైన పెట్టి. పెనుబారంగా ఆరుదల ఉండడం వలన ఈ విధంగా అయితే కొంటామని, ప్రవేట్ వ్యాపారస్తుల లో డిమాండ్ చేస్తున్నారు. మరి ఈరోజు కౌలు చేస్తున్నటువంటి కౌలు రైతులు సరైన గిట్టుబాటు ధర లేక అధిక దిగుబడి రాక తాను పండించిన పంట. అప్పుకు సరిపోయే పరిస్థితి కూడా కనబడలేదు. పరిస్థితి. ఇట్లా ఉంటే మా బతుకులు ఎలా గడుస్తాయి అని,ఆ పేద రైతుచెప్పడం జరిగింది..ఒకవైపు. మిషనరీ ఖర్చు ట్రాక్టర్ బాడీగా ఖర్చులు వస్తున్నాయి కానీ. ఒక బస్తా వచ్చేసి 2500 చొప్పున ప్రభుత్వం ఇస్తే. తానుకు గిట్టుబాటు ధర లభిస్తుందని. లేకుంటే మక్కఅప్పులే శరణం. ప్రైవేట్ వ్యాపారస్తుల తక్షణమే చర్యలు తీసుకోవాలని. ఇలాంటి రైతుల మోసం చేస్తూ. ఆరుదల కొంటున్నామని. నిలువునా దోస్తునటువంటి పైన ప్రవేట్ వ్యాపారస్తులపైనమ. తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా జెడి చర్యలు తీసుకోవాలని ..ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం . జిల్లా అధ్యక్షులు ఎస్ మార్క్ డిమాండ్ చేస్తూ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కరిముల్లా వారు మాట్లాడుతూ, వ్యవసాయ కూలీలు ఉన్నటువంటి కవులు సాగు చేసుకుంటూ, పండించిన పంటకు. ధరలు లేక వలసలు వెళుతున్న రాష్ట్ర ప్రభుత్వం. రైతన్న పై. మెడకు ఉరుతారు.

# జోడు పడవల ప్రయాణం సక్సెస్ దారెటు...

విజయవాడ, డిసెంబర్ 7, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సినిమాల సంగతి ఎలా ఉన్నా రాజకీయాలలో మాత్రం రాణించ లేక పోతున్నారు. కొంచెం ఆలస్యంగానే అయినా ఆయనే ఆ నిజాన్ని అంగీకరించారు. రాజకీయాల్లో తాను 'ఫెయిల్' అయ్యానని అయినా, రాజకీయాలను వదిలి వెళ్లనని, పోరాటం కొనసాగిస్తానని ప్రకటించారు. బాగుంది కానీ పవన్ కళ్యాణ్ రాజకీయాలలో ఎందుకు రాణించలేక పోతున్నారు? ఎందుకు ఫెయిల్ అవుతున్నారు? లోపం ఎక్కడ వుంది? అంటే, అందుకు కర్ణుడి చావుకు ఉన్నన్ని కారణాలు ఉంటే ఉ ండవచ్చును, ఉండవచ్చును కాదు ఉన్నాయి. కానీ ఆయన ఫెయిల్యూర్ కు ఒక ప్రధాన కారణం మాత్రం ఆయన చేస్తున్న జోడు పడవల ప్రయాణం. ఇటు సినిమాల్లో, అటు రాజకేయాల్లో ఇటో కాలు అటో కాలు అన్నట్లు ప్రయాణం చేయడం వలన సామాన్య జనం ఆయన్ని ఇంకా సినిమా హీరోగా చూస్తున్నారే తప్ప సీరియస్ పొలిటికల్ స్టార్ గా గుర్తించడం లేదు. అందుకే ఆయన మీటింగులకు వస్తున్నారు. చూస్తున్నారు. ఆయన చెప్పే డైలాగు వింటున్నారు చప్పట్లు కొడుతున్నారు. సినిమా చూసినట్లు చూస్తున్నారు. వెళు తున్నారు. అంతే తప్ప ఆయన్ని రాజకీయ నాయకుడిగా గుర్తించడంలేదు. అందుకే ఆయన రాజకీయాల్లో రాణించ లేక పోతున్నారని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. ఒక విధంగా ఆయనకున్న హీరో ఇమేజే రాజకీయాల్లో ఆయన జీరో ఇమేజ్ కి కారణం అవుతోందని విశేషకులు అంటున్నారు. సినిమాలు వదులు కునేందుకు పవన్ కళ్యాణ్ సిద్ధంగా లేరు. అలాగని అన్న చిరంజీవి అడుగుజాడల్లో రాజకీయాలకు చుక్క పెట్టి సినిమాలకు పరిమితయ్యే ఆలోచన కూడా పవన కళ్యాణ్ కు లేదు. చిరంజీవి రాజకీయాలు వదిలేసినా రాజకీయాలు ఆయన్ని వదలడం లేదు అలాగే పవన్ కళ్యాణ్ కు అదో ఇదో ఏదో ఒకటి వదిలించుకునే ఆలోచన వుందో లేదో కానీ, అటు రాజకీయాలు, ఇటు సినిమాలు రెండూ కూడా పవన్ కళ్యాణ్ ను వదలడం లేదని ఆయన సన్నిహితులు, అభిమానులు అంటున్నారు. ఒకటి కావాలంటే ఒకటి వదులుకోవాలి కానీ, పవన్ కళ్యాణ్ ఏదీ వదులుకునే పరిస్థితిలో లేరు. సినిమాలు వదులు కుంటే పార్టీ నడవదు. రాజకీయాలు వదులు కుంటే, చిరంజీవి అన్నయ్యలా, ఇంచక్కా చిందులు, విందులలో మునిగి తెల వచ్చును. కానీ, పవన్ కళ్యాణ్ ఇంకా అందుకు సిద్దం అయినట్లు లేరు. అదలా ఉంటే ఓ వంక ఏపీలో ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. అధికార వైసీపీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీ టీడీపీ ఎన్నికల కురుక్షేత్రానికి సిద్ధమవుతున్నాయి. అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటిస్తున్నారు. జనం బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి వెన్నులో వణుకు మొదలైంది. ఆయన పరుగుల్లో ఆయనున్నారు. మరోవంక టీడీపీ యువనాయకుడు లోకేష్ పాదయాత్రకు సిద్దమవుతున్నారు. చివరకు స్టేట్ పాలిటిక్స్ లో స్టేక్ లేని బీజేపీ , కాంగ్రెస్, వామ పక్ష పార్టీలు కూడా ఏంతో కొంత హడావిడి చేస్తున్నాయి. జనసేన ఏమీ చేయకుండా చేతులు ముడుచుకు కూర్చుందని కాదు కానీ, సర్వం తానైన పవన్ కళ్యాణ్ ఏ మేరకు పార్టీకి సమయం ఇవ్వగలరు అనేదే ఇప్పుడు జన సైనికుల ముందున్న ప్రశ్న. నిజానికి జనసేన ప్రచార రథాలు ఇంచుమించుగా సంవత్సరం క్రితమే సిద్ధమయ్యాయి. జిల్లాల్లో ప్రచారం కోసం బయలుదేరి వెళ్ళాయి, కానీ, ప్రచారం మాత్రం అంతగా పట్టాలు ఎక్కలేదు. మరోవంక జనవరి 2023 నుంచి, పవన్ కళ్యాణ్ బస్సుయాత్ర ప్లాన్ చేసుకున్నారు. బస్సు కూడా రెడీ అయింది. అయితే, పవన్ కళ్యాణ్ బస్సు యాత్రకు ఎంత వరకు డేట్స్ ఇవ్వగలరనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వరసగా వస్తున్న సినిమా ప్రకటనలు గమనిస్తే, ఎన్నికల చివరి సంవత్సరంలో అయినా పవన్ కళ్యాణ్ పార్టీకి సమయం కేటాయించగలరా అనేది అనుమానంగానే ఉందని అంటున్నారు. ప్రస్తుతం షూటింగ్ జరుగుతున్న హరిహర వీరమల్లు కంప్లీట్ అవడానికి జనవరి వరకూ పడుతుంది.. ఆ తర్వాత వెంటనే మరో రెండు సినిమాల షూటింగ్‌లో పాల్గొంటారని ఆయా సినిమాల రూపకర్తలు ప్రకటించారు. సుజిత్ డైరక్షన్‌లో ఓ సినిమాను కొత్తగా ఎనౌన్స్ చేయగా.. గతంలోనే ప్రకటించిన హరీష్ శంకర్ దర్శకత్వంలోని సినిమా కూడా వచ్చే వారం నుంచే ప్రారంభమవుతుందని.. హరీష్ శంకరే ప్రకటించారు. ఎలా లేదన్నా ఒక్క సినిమా షూటింగ్‌కు కనీసం నాలుగు నెలలు పడుతుంది. మరి కొన్ని కమిట్ మెంట్స్ కూడా ఉన్నాయి. ఇవ్వన్నీ అయ్యే సరికి పుణ్యకాలం పూర్తయి ఎన్నికల రానే వస్తాయి. ఈ నేపధ్యంలో పవన్ కళ్యాణ్ బస్సు యాత్ర మీద అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఒకటి రెండు సార్లు వాయిదా పడిన బస్సు యాత్ర అనుకున్నవిధంగా జనవరిలో మొదలవుతుందా? మొదలైనా, నిరాటంకంగా జరుగుతుందా, షూటింగుల మధ్యలో, 'గ్యాప్' యాత్రలు చేస్తారా అన్నదానిపై ఇప్పటికే స్పష్టత లేదు. సో.. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఎందుకు రాణించలేక పోతున్నారో, ఎందుకు ఫెయిల్ అయ్యారో అర్ధమైంది. కానీ, ఆయన సినిమాలు చేయకపోతే, రాజకీయం చేయలేరు, సినిమాలు చేస్తే రాజకీయాలలో రాణించలేరు, పెళ్ళైతే కానీ పిచ్చి కుదరదు.. పిచ్చి కుదిరితే గానీ, పెళ్లి కాదు. పీకేది ..అదే .. అదే డైలమా ...

## బీజేపీ నేత బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హౌస్ అరెస్ట్

కర్నూలు బీజేపీ నేత బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిని పోలీసులు గురువారం ఉ దయం హౌస్ అరెస్టు చేసారు. ఇటీవల రాయలసీమ గర్జన జరిగిన ఎస్టీబిసి కాలేజ్ గ్రౌండ్ ను పాలతో శుభ్రం చేస్తామని బైరెడ్డి చెప్పారు. శ్రీబాగ్ ఒప్పందంలో మూడు రాజధానులు అంశమే లేదు. రాజధాని రాయలసీమలో ఉండాలని చెప్పారు అప్పుడు. ఇప్పుడు రాయలసీమకు నయవంచన చేసేందుకే గర్జన సభ పెట్టారని ఆయన ఆరోపించారు. అప్పట్లో నెహ్రూ .. రాజధాని కర్నూలులో ఉండాలని ప్రకటించిన ఎస్టిబిసి మైదానాన్ని గర్జన సభ పెట్టి కలుషితం చేసారు. ఎస్టీబిసి మైదానంలో సభ స్టేజి వద్ద పాలతో శుభ్రం చేస్తాం. అప్పట్లో రాయలసీమను చీల్చడానికి రాయల్ తెలంగాణ,సీమాంధ్ర అని చెప్పినప్పుడు ఎందుకు మాట్లాడలేదని అయన అన్నారు. గురువారం ఉ దయం ఎస్టీబిసి కాలేజ్ గ్రౌండ్ కు బైరెడ్డి రాకుండా పోలీసులు హౌస్ అరెస్ట్ చేసారు.

## బిక్షాటన చేసిన జేసీ ప్రభాకర్ రెడ్డి

అనంతపురం తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి ఇంటి వద్ద ఉ ద్రిక్తత పరిస్థితి నెలకొంది. మున్సిపాలిటీలో కొన్ని వాహనాలు మూలన పడటంతో పట్టణంలో చెత్త సేకరణ తదితర సమస్యలు నెలకొన్నాయి. మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి వాటిని వెంటనే మరమ్మత్తులు చేయాలని భావించారు. దీనికి మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా స్పందించక పోవటంతో, ఛైర్మన్ జెసి రోడ్డు బాట పట్టడానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలోనే నేడు బుధవారం తాడిపత్రి పట్టణంలో భిక్షాటన కార్యక్రమం చేపట్టాలని వాటికి తెదేపా కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు సిద్దం కావాలని సూచించగా, ఆయన ఇంటికి అందరూ చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఉదయాన్నే భిక్షాటనను పోలీసులు అడ్డుకునేలా ఉదయాన్నే జెసి నివాసాన్ని చుట్టుముట్టారు. రెండంచెల భద్రత మధ్యలో ఆయన భిక్షాటన కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి పోలీసులు పెద్ద సంఖ్యలో జెసి నివాసం చేరుకున్నారు. మరమ్మత్తులు నోచుకోని వాహనాలను తాము భిక్షమెత్తి గాని, రిపేరీ చేయిస్తానని, అంతేకాని, మరమ్మత్తులు పేరిట టెండర్లు నిర్వహిస్తే ఒప్పుకోనని, ఈ విషయాలన్ని ప్రజలకు తెలియజేయడం కొరకే, తాను నేడు ఈ భిక్షాటన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జెసి తెలిపారు. ఒక సందర్బంలో అడ్డుకున్న పోలీసులు తమను ఎందుకు అడ్డుకున్నారో సమాధాన పత్రం ఇవ్వాలని అడిగారు. అంతేకాకుండా, ఇందులో మీ పాత్ర ఏమి లేదని, పాపం పోలీసులు అని మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. జనవరి ఒకటో తేదీ లోపల అధికారుల తీరు మారకపోతే, తామే ముందుండి తమ స్వంత నిధులను వెచ్చించి, పట్టణ ప్రజలకు సేవలు చేయడానికి ముందుంటానని తెలిపారు. రాష్ట్రంలో ఏకైక మున్సిపల్ ఛైర్మన్ ను నేనే, నన్ను గెలిపించిన ప్రజల కొరకు ఎన్ని కష్టాలు ఎదురైనా, సేవ చేయడానికి వెనకాడేది లేదని పేర్కొన్నారు. తాడిపత్రి డిఎస్పీ ఎమ్మెల్యే చెప్పిన మాట తూచా తప్పకుండా పాటిస్తారని, ఇక్కడికి వచ్చిన పోలీస్ ఇబ్బంది కలగకుండా ఉండేందుకు, నేను నా ఇంటి పరిధిలోనే నిరసన తెలుపుతున్నాను అని జెసి మీడియాతో వ్యాఖ్యలు చేశారు.

## తాడిపత్రి లో ఉద్రిక్తత

అనంతపురం అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో టెన్షన్ టెన్షన్ నెలకొంది. తాడపత్రి పట్టణంలో మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనాలు పనిచేయటం లేదని మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి పదరు వాహనాలతో ర్యాలీ చేయడానికి నిర్ణయించారు. అయితే పట్టణంలో 30 యాక్ట్ అమల్లో ఉన్నందున ర్యాలీ చేయకూడదని పోలీసులు అంటున్నారు. బుధవారం ఉ దయం జెసి ప్రభాకర్ రెడ్డి ఇంటి వద్ద భారీగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసారు. తాడిపత్రి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి బిక్షాటకం చేపడుతాడానని జేసీ ప్రభాకర్ రెడ్డి అంటున్నారు. మున్సిపాలిటీలో నిధులు లేక తాగునీరు అందించలేకపోతున్నాము. కనీసం చెత్త సేకరణ చేసే వాహనాలుకు కనీసం డిజల్ వేసుకోవడానికి కూడా నిధులు లేవని అయన అన్నారు. నిధులు కోసం నిరసన ర్యాలీ చేస్తున్నా ననిజేసీ ప్రభాకర్ రెడ్డి, అందుకు అనుమతి లేదని పోలీసులు అంటున్నారు.

## పార్టీలో పెరుగుతున్న అసంతృప్తులు

విజయవాడ, డిసెంబర్ 7,తెలుగు రాష్ట్రాలలోనే కాదు, దేశంలో ఏ రాష్ట్రంలో చూసినా ఇదే పరిస్థితి, ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజాప్రతినిధులు చొక్కా మార్చినంత ఈజీగా పార్టీలు మార్చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో, ఈ పార్టీ నుంచి ఆ పార్టీలోకి, ఆ పార్టీ నుంచి ఈ పార్టీలోకి ఫిరాయింపులు మరింత జోరుగా సాగుతూ ఉంటాయి. అయితే ఆంధ్ర ప్రదేశ్ లో పరిస్థితి అందుకు కొంత భిన్నంగా కనిపిస్తోంది. నిజానికి, ఏపీలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం వుంది. అయినా ఎన్నికల వేడి రాజుకుంది. పొలిటికల్ హీట్ రోజురోజుకు పెరిగి పెరిగి పీక్ కు చేరుతోంది. మరో వంక అధికార వైసీపీలో అసంతృప్తి సెగలు బుసలు కొడుతున్నాయి. ఈ నేపధ్యంలో, పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటి నుంచే పక్క దారులు చూస్తున్నారు. మరో వంక పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు, తమ వైఫల్యాలు, చేతకాని తనాన్ని, ఎమ్మెల్యేల మీదకు నెట్టి, తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇంటింటి పరీక్షలో నెగ్గితేనే మళ్ళీ టికెట్ అంటూ సిట్టింగ్ ఎమ్మెల్యేలను టెన్షన్ గు గురి చేస్తున్నారు. ఈ పరిస్థితులలో, కీడెంచి మేలెంచడం మంచిదని, కొందరు కీలక నేతలు ముందుగానే పక్క పార్టీల్లో కర్చీఫ్ వేస్తున్నారు. నియోజక వర్గంలో పరిస్థితిని బేరీజు వేసుకుని వైసీపీని వదలవలసి వస్తే ఏ పార్టీలో చేరితే తమ రాజకీయ భవిష్యత్ నిలబడుతుందన్న లెక్కలు వేసుకుంటున్నారు. సహచరులతో మంతనాలు సాగిస్తున్నారు. ఏపీలో వైసీపీకి ఏకైక ప్రత్యాన్మాయం టీడీపీ. సో .. సహజంగానే, ముందు జాగ్రత్తగా వైసేపీ సీనియర్ ఎమ్మెల్యేలు టీడీపీలో చేరేందుకు రెడీ అవుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటుగా, వైసీపీ 'ముఖ్య' నేతలు కూడా టికట్ హామీతో టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది నెల్లూరు జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు మాజీమంత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే ఆనం రాంనారాయణరెడ్డి పార్టీ నియోజక వర్గం 'మార్పు' గురించి వస్తున్న వార్తలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ప్రస్తుతం వైసీపీలోనే ఉన్నానని తాను పోటీచేసే విషయం చెప్పాల్సింది తమ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. ముందుగానే ఏదేదో ఊహించుకొని ఇక్కడే పోటీచేస్తాను.. అక్కడ పోటీచేస్తానంటూ చెప్పడం కూడా సరికాదన్నారు. ప్రస్తుతం వెంకటగిరికి సిట్టింగ్ ఎమ్మెల్యేగా తనకు ఆ అర్హత ఉందన్నారు. అయితే, ఆయన ప్రస్తుతానికి వైసీపీలోనే ఉన్నా నని చెప్పడం, సిట్టింగ్ ఎమ్మెల్యేగా వెంకటగిరి నుంచి మళ్ళీ పోటీ చేసే 'అర్హత' ఉందని నొక్కి చెప్పడం వెనక రాజకీయ మర్మం ఏమిటనే చర్చ జరుగుతోంది. అయితే ఆనం రామనారాయణ రెడ్డి, ఈ వ్యాఖ్యల ద్వారా సున్నితంగానే అయినా ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి ఒక హెచ్చరిక చేశారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మంత్రి పదవిని ఆశించి భంగపడిన ఆనం ఫాను పార్టీలో చాలా కాలంగా ఉక్కపోతకు గురవుతున్నారు, అసంతృప్తితో రగిలిపోతున్నారనే వార్తలొస్తున్నాయి. ఇప్పటికే ఒకటి రెండు సందర్భాలలో ఆనం తమ అసంతృప్తిని బయట పెట్టినా సరైన సమయం కోసం ఎదురు చూస్తున్నారని, అయన సన్నిహితులు చెప్పుకొస్తున్నారు. మరోవంక ఆత్మకూరు ఉపఎన్నిక సమయంలో, ఆనం కుమార్తె, కైవల్యా రెడ్డి టీడీపీలో చేరారు. నిజానికి అప్పటి నుంచి ఆనం టీడీపీలో చేరడం ఖాయమనే ప్రచారం జరుగుతోంది. ఆలాగే, ఆయన ఈసారి ఆత్మకూరు నుంచి పోటీ చేస్తారనే ప్రచారామ్ కూడా జోరుగా సాగుతోంది. అయితే, ఆయన అనుచరులు చెపుతున్నట్లుగా వచ్చిన దారిలో వెనక్కి వెళ్ళిపోవడం కాకుండా, తన సీనియారిటీని గుర్తించక పోవడమే కాకుండా, జిల్లా రాజకీయాల్లో తమ కుటుంబ ప్రతిష్ట దెబ్బతీసే ప్రయత్నాలు సాగిస్తున 'ప్రత్యర్ధుల' ను దెబ్బతీసే వ్యూహంతో ఆనం ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. అందుకే, ఆయన తాజాగా,మీడియాలో వస్తున్నట్లుగా తనకు వేరే ఆలోచన ఉంటే.. ఆ మాట తన నోటినుంచి రాబోయే ముందు కాగితం పక్కనపెట్టి చెబుతానన్నారు. తన రాజకీయ భవిష్యత్తుపై అప్పటివరకు ఎవరికీ ఏ అనుమానం అక్కర్లేదని చెప్పారు. అలాగే తనకు ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండేందుకే టికెట్ ఇచ్చారని, ఈ ఐదు సంవత్సరాల చివరి రోజు వరకు వైసీపీ ఎమ్మెల్యేగానే కొనసాగుతానన్నారు. ఆనం రామనారాయణ రెడ్డి తాజా వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లోనే కాదు, రాష్ట్ర రాజకీయాల్లోను వేడిని రాజేస్తున్నాయి. నిజానికి, వైసీపీలో ఒక్క ఆనం మాత్రమే కాదు ప్రస్తుత మంత్రి వర్గంలో ఉన్న కొందరు మంత్రులతో సహా సీనియర్ నాయకులు, ముఖ్యంగా అదే సామాజిక వర్గానికి చెందిన నాయకులు ఆనం కంటే ఎక్కువగా అసంతృప్తితో రగిలిపోతున్నారని తెలుస్తోంది.

## రైలుకింద ఇరుక్కున్న యువతి



విశాఖపట్నం విశాఖపట్నం జిల్లాలోని దువ్వాద రైల్వే స్టేషన్లో ప్రమాదం చోటుచేసుకుంది. ట్రైన్ దిగుతున్న సమయంలో ఓ యువతి జారిపడింది. దీంతో ట్రైన్కు, ప్లాట్ఫామ్కు మధ్యన ఇరుక్కుపోవడంతో గంట పాటు నరకయాతన అనుభవించింది. వివరాలు.. అన్నవరానికి చెందిన శశికళ దువ్వాడలోని ఓ కాలేజ్లో చదువుకుంటుంది. కాలేజ్ వెళ్లేందుకు శశికళ గుంటూరు-రాయగడ రైలులో దువ్వాడకు చేరుకుంది. అయితే రైలు దిగుతున్న సమయంలో ఆమె ప్లాట్ఫామ్-ట్రైన్ మధ్యలో ఇరుక్కుపోయింది. దీంతో ఆమె కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఇది గమనించిన రైల్వే పోలీసులు, సిబ్బంది వెంటనే స్పందించారు. రైలును నిలిపివేశారు. అతి కష్టం మీద రైల్వే సిబ్బంది యువతిని బయటకు తీశారు. అయితే ఈ సమయంలో యువతి తీవ్ర నరకయాతన అనుభవించింది. ఆమెను బయటకు తీసిన వెంటనే ఆస్పత్రికి తరిలించారు.

## చొక్కాని ఉత్సవంలో అపశృతి

తిరుపతి శ్రీకాళహస్తి ముక్కంటి ఆలయంలో భక్తుల మధ్య ఏర్పాటు చేసిన చొక్కాని ఉత్సవంకు భక్తులు విశేషంగా హాజరయ్యారు భక్తుల మధ్య దీపోత్సవమును వెలిగియడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో అక్కడున్న భక్తులను ఆలయ సెక్యూరిటీ అదుపు చేయలేకపోయారు దానితో భక్తుల మధ్య తోపులాట తొక్కిసలాట జరగడం తో అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది శ్రీదేవికి చెయ్యి విరిగిపోవడం మరి కొంతమంది భక్తులకు గాయాలు అయ్యాయి.

## మూడు రోజులపాటు వర్షాలు

విజయవాడ ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్రవాయుగుండం కొనసాగుతోంది. బుధవారం ఉదయం తీవ్రవాయుగుండం కారైకాల్కు తూర్పు-ఆగ్నేయంగా 770కి.మీ, చెన్నైకి 830కి.మీ దూరంలో కేంద్రీకృతం అయింది. క్రమంగా తుఫానుగా బలపడింది. గురువారం ఉదయానికి నైరుతి బంగాళాఖాతం సమీపంలోని ఉత్తర తమిళనాడు- దక్షిణకోస్తాంధ్ర తీరాలకు తుఫాన్ చేరనుంది. తరువాత 48 గంటలు ఉత్తర తమిళనాడు -దక్షిణకోస్తా తీరాలకు ఆనుకుని కొనసాగనుంది. తుఫాన్ దీని ప్రభావంతో రేపటి నుంచి మూడు రోజులపాటు దక్షిణకోస్తాలోని ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయి. రాయలసీమలోని చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం వుంది. మిగిలిన చోట్ల విస్తారంగా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం వుంది. గురువారం నుంచి తీరం వెంబడి గంటకు 50-60 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయి. ఇప్పటికే ప్రభావిత జిల్లాల యంత్రాంగానికి సూచనలు జారీ చేసారు. ఈ సమయంలో? సముద్రం అలజడిగా ఉంటుంది. దక్షిణకోస్తా - తమిళనాడు తీరాల వెంబడి శనివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదు. వేటకు వెళ్ళిన మత్స్యకారులు వెంటనే వెనక్కి తిరిగి రావాలి. వర్షాల నేపధ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల సంస్థ హెచ్చరించింది.

## రాత్రి ఇంట్లో ఉన్న యువతి తెల్లారేసరికి మిస్సింగ్

విజయవాడ రాత్రి ఇంట్లో పడుకున్న యువతి తెల్లవారేసరికి కనిపించకుండా పోయిన ఘటన కృష్ణా జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. వయసులో వున్న అమ్మాయి కనిపించకుండా పోవడంతో కుటుంబసభ్యులు కంగారుపడుతున్నారుయువతి కోసం పోలీసులు గాలింపు కొనసాగుతోంది. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం తెన్నేరు గ్రామానికి చెందిన పామర్తి లావణ్య(20) విజయవాడ స్టెల్లా కాలేజీలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రోజూ మాదిరిగానే గత సోమవారం కూడా కాలేజీకి వెళ్లివచ్చింది. రాత్రి భోజనం చేసి పడుకున్న ఆమె తెల్లవారేసరికి కనిపించకుండా పోయింది. దీంతో కంగారుపడిపోయిన కుటుంబసభ్యులు మంగళవారం రోజంతా వెతికారు. ఆచూకీ లభించలేదు. దీంతో లావణ్య తల్లి కంకిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## నేత్రపర్వంగా అల్లూరు పోలేరమ్మకు పల్లకీసేవ



కావలి నెల్లూరు జిల్లా, కావలి నియోజకవర్గంలోని అల్లూరు గ్రామదేవత పోలేరమ్మ పల్లకీసేవ ఉత్సవం మంగళవారం రాత్రి శోభాయమానంగా సాగింది. అమ్మవారి భక్తులైన మన్నెమాల సుకుమార్ రెడ్డి, ఆయన కుటుంబం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా శాంత స్వరూపిణి అయిన పోలేరమ్మకు పూలపల్లకీ సేవ నిర్వహించారు. అల్లూరు పోలేరమ్మ ఆలయానికి ప్రత్యేక విశిష్టత ఉంది. ప్రతీఏటా జనవరిలో నిర్వహించే అమ్మవారి జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా విదేశాల్లో స్థిరపడ్డ అల్లూరీయులు కూడా హాజరవుతుంటారు. పాడిపంటలను కాచే దేవతగా అమ్మవారికి విశేషమైన గుర్తింపు ఉంది. ఈకారణం చేతనే జిల్లాలోనే అత్యధిక వరి దిగుబడులు కూడా అల్లూరులోనే నమోదవుతుండటం విశేషం. అంతటి విశిష్టమైన పోలేరమ్మకు పల్లకీసేవ అంటే ప్రీతికరం. పల్లకీసేవ సమయంలో అమ్మవారు శాంతస్వరూపిణిగా ఉంటారు అని ప్రతీతి. అమ్మవారికి ఇష్టమైన పల్లకీసేవను సుకుమార్ రెడ్డి, ఆయన కుటుంబం ప్రత్యేకంగా నిర్వహించారు. పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల విన్నపాల మధ్య వివిధ రకాల పుష్పాలతో నేత్రపర్వంగా అలంకరించిన పూలపల్లకీపై అమ్మవారు ఊరేగారు. ఆద్యంతం కరుణ కురిపిస్తూ, అభయాశీస్సులు అందిస్తూ ఊరేగుతున్న అమ్మవారిని దర్శించుకుని భక్తులు తన్మయత్వానికి గురయ్యారు. అల్లూరుతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు, కావలి శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి దంపతులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలపల్లకీసేవ సందర్భంగా ఆలయప్రాంగణాన్ని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడంతో ఆలయమంతా సుగంధం నెలకొంది. భారీ బాణసంచా వెలుగులు ఆకాశాన్ని మిరుమిట్లుగొలిపించాయి. సంగీత విభావరి, చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆకట్టుకున్నాయి. భక్తులకు అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేయడంలో మన్నెమాల సుకుమార్ రెడ్డి తన మార్క్ ను ప్రదర్శించడం తో భక్తులు ఆయన ఉదార స్వభావాన్ని, తెంపు ను గుర్తు చేసుకున్నారు.

## జడ్పీ స్కూల్ లో స్మార్ట్ క్లాస్ రూమును ప్రారంభించిన మంచు లక్ష్మీ

శ్రీకాకుళం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమును సినీ తార మంచు లక్ష్మి బుధవారం ప్రారంభించారు. తరువాత ఆమె మీడియాతో మాట్లాడారు. టీచ్ ఫర్ చేంజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. జిల్లాలో 20 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసాం. ప్రభుత్వం నిర్దేశించిన పాఠశాలలో ప్రత్యేకంగా తరగతి గదులను కేటాయించి స్మార్ట్ క్లాసులను నిర్వహిస్తామని అన్నారు. స్మార్ట్ క్లాసులకు తన సొంత నిధులను కేటాయించి తరగతుల నిర్వహిస్తున్నాను. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మెరుగైన విద్యను పొందేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు

## 50 మంది పేదలకు బ్లాంకెట్స్ పంపిణీ

కమాన్ పూర్ రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం 50 మంది నిరుపేదలకు బ్లాంకెట్స్ ను సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అందించారు. సెంటినరీ కాలనీకి చెందిన బిల్డర్ పాల ప్రవీణ్, గొల్లూరి సాయిరాజ్, ఆరేపల్లి వెంకటేష్, ఆరేపల్లి అభిలాష్, గూడేపు ప్రవీణ్ లు తమ సొంత ఖర్చులతో వీటిని కొనుగోలు చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందికి, స్థానిక నిరుపేదలకు, వృద్ధులకు, ప్రతిభ హోమ్స్ కార్మికులకు వీటిని అందించారు. చలికాలం కావడంతో చలితో బాధపడకుండా ఉ ండేందుకు వీటిని అందించడం అభినందనీయమని సర్పంచ్ పల్లె ప్రతిమ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ పెండ్లి రమ్య, స్థానిక నాయకులు గిరవేన రాములు, సందవేన కుమార్, కారోబార్ కొండపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఏమి ఆశించకుండా చేసేదే సేవ.-ఎమ్మెల్సీ మధుసూదనా చారి.

నెల్లూరు సేవ ద్వారానే మనిషికి నిజమైన తృప్తి కలుగుతుందని శాసన మండలి సభ్యులు సిరికొండ మధుసూదనా చారి పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు ఎస్.ఆర్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం హైదరాబాద్ లోని రవీంద్ర భారతి ఏ/సి కాన్ఫరెన్స్ హాల్ నందు అంతర్జాతీయ స్వచ్ఛంధ సేవకుల దినోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పి.మన్మోరేంద్ర శర్మ, కర్రె మల్లేశం, భగవాన్ రెడ్డి, నిమ్స్ శ్రీహరిరాజు, లక్ష్మీ సూర్య లత, ఎమ్.మధుసూధన్ రావు, మధుసూధన్, పిట్టల అంజయ్య, ఆలియా భాను లను సేవారత్న అవార్డుతో సత్కరించారు. డాక్టర్ సగిలి సుధారాణి, ఎస్.రవిప్రకాష్ రావు, కపిలవాయి అశోక్ బాబు లను సాహిత్యరత్న అవార్డుతో సత్కరించారు. అనంతరం ఎమ్. రామచంద్ర రావు, ఆదూరి కళాధర్ రాజు, సోమ అంజిరెడ్డి, జాలిస్టార్ సాంబశివరావు, చిట్టి బాలనాగేశ్వర రావు లను కళారత్న అవార్డులు అందజేశారు. ఈకార్యక్రమానికి డాక్టర్ ఎస్.పి.భారతి సభాధ్యక్షులుగా వ్యవరించారు. ఈకారక్రమంలో తెలంగాణ పర్యాటక శాఖ చైర్మన్ ఉ ప్పల శ్రీనివాస గుప్త, సర్వజన సేవా ట్రస్టు చైర్మన్ ఉన్నం సుబ్బారావు, నిర్వాహకులు కె.మురళీమోహన్ రాజు, ఎస్.రామచంద్ర రావు, పొదిలి కనకరత్నం, వై.చంద్రశేఖర్ రెడ్డి, భూపాలరావు, కళ్యాణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూల్ లో, సంక్షేమ హాస్టళ్లలో, రెసిడెన్షియల్ స్కూల్ లలో సన్నబియ్యం తోనే భోజనం అందించాలి

### బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, విద్యార్థి, యువజన సంఘం డిమాండ్





ఆత్మకూరు డిసెంబర్ 07 ఆత్మకూరు మండలం కొట్టాల చెరువు గ్రామంలో ఉన్నటువంటి ఎంపీపీ స్కూల్ ను తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ విద్యార్థి,యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాలుట్ల రమణ ఈ సందర్భంగా బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ, విద్యార్థి, యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలుట్ల రమణ మాట్లాడుతూ, కొట్టాల చెరువు గ్రామంలో ఉన్నటువంటి ఎంపీపీ స్కూల్లో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించడం జరిగింది. స్కూల్లో ఉన్నటువంటి విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని మెనూ ప్రకారం అందించడం జరుగుతుంది మరియు భోజనం కూడా బాగుందని సంతృప్తి కరంగా ఉందని ఆయన వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో,అంగన్వాడీ కేంద్రాలలో, సంక్షేమ హాస్టళ్లలో, రెసిడెన్షియల్ స్కూల్ లలో, సన్న బియ్యంతో కూడిన ఆహారం విద్యార్థులకు అందించాలని, తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే విద్యార్థులకు సన్న బియ్యం తో కూడిన ఆహారాన్ని అందిస్తుందని, అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసిన వాగ్దానం ప్రకారం విద్యార్థులకు సన్న బియ్యం తో కూడిన ఆహారాన్ని అందించాలని, ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బద్వేలలో సజీవంగా ఆక్రమణలు



బద్వేలు ,దర్జాగా రహదారులు మురికి కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన దురాక్రమదారులపై సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు కనీసం అలాంటి ప్రయత్నాలు కూడా చేయకపోవడం విమర్శలకు కారణమవుతుంది అసలు దురాక్రమలపై చర్యలు తీసుకుంటారా లేదా అన్నది శేష ప్రశ్నగా మారింది ఆక్రమణలు ఏ స్థాయిలో ఉన్న వాటిని తొలగించాలని ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమరావతిలో జరిగిన ఉన్నత అధికారుల సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన బద్వేలు లో గత కొన్ని దశాబ్దాలుగా రహదారి పక్కనే ఆక్రమణ లు కొనసాగుతున్నాయి ఇది అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే మురికి కాలువలు రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు చేసి వాటిని వేల రూపాయలకు బాడుగలకు ఇచ్చి ప్రతి నెల వసూలు చేసుకుంటున్నారు ఆక్రమణల కారణంగా రహదారులు ఇరుకై తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగాయి జరుగుతున్నాయి కూడా ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారుల్లో పెద్ద ఎత్తున ఆక్రమణలు ఉన్నాయిపట్టణంలో మైదుకూరు నెల్లూరు కు వెళ్లే ప్రధాన రహదారి జాతీయ రహదారిగా ఉంది జాతీయ రహదారి మాటే గాని గతంలో ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది జాతీయ రహదారి నిర్మించేటప్పుడు సంబంధిత అధికారులు ఆక్రమణ లు తొలగించేందుకు రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ ఇచ్చారు కానీ రాజకీయాలు చోటు చేసుకోవడంతో తర్వాత ఎటువంటి ఆక్రమణలు తొలగించకుండానే రహదారి నిర్మించారు కాలువలు రహదారులు ఆక్రమించారని ఆక్రమణదారులకు అధికారులు అప్పట్లోనే నోటీసులుకూడా ఇచ్చారు కొందరు పెద్దలు ఆక్రమణదారుల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు దండుకొని ఆక్రమణ జోలికి పోకుండా అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చి సఫలీకృతులయ్యారు దీంతో ఎటువంటి ఆక్రమణలు తొలగించ కుండానే పట్టణంలో జాతీయ రహదారి నిర్మించారు పేరుకే జాతీయ రహదారి కానీ గతంలో రహదారి ఎలా ఉండేదో ఇప్పుడు కూడా అలాగే ఉంది గతంలో మున్సిపల్ పాలకవర్గం అధికారులు కొన్ని అక్రమ కట్టడాలు తొలగించినప్పటికీ రాజకీయ ఒత్తిడి ల కారణంగా ఆక్రమాల తొలగింపు పూర్తిస్థాయిలో జరగలేదు తొలగించిన కట్టడాల స్థానంలో తిరిగి నిర్మాణాలు జరిగాయి తమ ఆస్తిని ఆక్రమించి నిర్మాణాలు చేశారని ఆర్టీసీ అధికారులు

### ఆక్రమణలపై చర్యలు తీసుకునే అధికారులు ఎక్కడ?

సంవత్సరాల తరబడి చెబుతున్న వారి రోదన అరణ్య రోదనగా మారింది పోరుమామిళ్ల రహదారిలో ఆక్రమణ సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ ఆక్రమించి పలు దుకాణాలు వెలిశాయి బాడుగల్కి ఇచ్చి ప్రతినెల వేల రూపాయలు దండుకుంటున్నారు ఇదేమి అన్యాయమని అడిగేవారు లేకుండా పోయారుఆక్రమణలు తొలగించాలని ప్రజలు సంవత్సరాల తరబడి వేడుకుంటున్న అధికారుల్లో ఏమాత్రం స్పందన లేకపోవడం విచారకరం గతంలో అప్పటి జిల్లా ఇన్చార్జి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సైతం బద్వేల్ లో ఆక్రమణలు పరిశీలించి వాటిని రెండు వారంలోగా తొలగించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు కానీ ఫలితం మాత్రం లేకుండా పోయింది తమను ఎవరు ఏమి చేయాలన్న ధీమా ఆక్రమణదారుల బలంగా ఉంది గతంలో అప్పటి కడప జిల్లా కలెక్టర్ హరికిరణ్ అప్పటి జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ బద్వేల్ లో రెండు గంటలపాటు నాలుగు రోడ్ల కూడలిలో మకాం వేసి ఆక్రములంటిని పరిశీలించారు గుర్తించిన ఆక్రమణలు త్వరితగతిన తొలగిస్తామని చెప్పడం జరిగింది అయినా ప్రయోజనం లేకుండా పోయింది

## ట్రాఫిక్ నియమాలు పాటించండి సురక్షితంగా గమ్యం చేరండి

### --జిల్లా ఎస్పీ రఘువీరా రెడ్డి

నంద్యాల :-రోడ్డు భద్రత ప్రమాణాలు ,ట్రాఫిక్ నిభందనలు పాటించి సురక్షిరంగా గమ్యం చేరండి. జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి అన్నారు .ప్రాణం చాలా విలువైనది. మన కొద్ది పాటి నిర్లక్ష్యం అయిన వారికి తీరని శోకాన్ని మిగులిస్తుంది.రోడ్డు ప్రమాదాలలో మరణించడం, గాయపడడము, అంగవికలాంగులు అవ్వడం దురదృష్టకరం. మనం కొద్ది పాటి జాగ్రత్తలు పాటిస్తే మన ప్రాణాలను మరియు ఎదుటి వారి ప్రాణాలను కాపాడగలము .ఈ సందర్బముగా ఎస్పీ గారు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా ప్రమాణాల ముఖ్య ఉద్దేశ్యం (మోటార్ వెహికల్ )చట్టాన్ని కఠినంగా అమలు చేయడం. తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడం. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను( బ్లాక్ స్పాట్ ) గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు అనగా స్పీడ్ బ్రేకర్స్ ను ,స్టాపర్స్ బొర్డ్స్ ను ,రేడియం స్టికర్స్ ను ,డేంజర్స్ సిగ్నల్ ను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు . క్రింది నిభందనలు పాటించకుండా జిల్లాలో ఈ సం. లో 603 రోడ్డు ప్రమాదాలు జరగగా సుమారుగా 265 మంది ప్రాణాలు కోల్పోయినారు మరియు 13 మంది తీవ్రమైన గాయాలతో ప్రాణాలతో భయటపడగా సుమారు 703 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

## మత సామ్రాజ్యానికి మారుపేరే మన ఎమ్మిగనూరు,పట్టణ తెలుగుదేశం కార్యదర్శి, నవాజ్,




ఎమ్మిగనూరుపట్టణంలో డిసెంబర్ 7 బుధవారం రోజు అయ్యప్ప స్వామి ఆలయంలో 41 రోజు ఎంతో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మాలలు ఉన్నటువంటి భక్తులను మరియు నవాజ్ ముఖ్యఅనుచెర్లు అయ్యప్ప స్వామి దేవాలయానికి బయలుదే రే సందర్భంగా అయ్యప్ప స్వాములకు తెలుగుదేశం పట్టణ కార్యదర్శి నవాజ్ స్వాములకు పూలమాలతో సత్కరించి వాళ్లకు సాగనంపడం జరిగింది ఈ సందర్భంగా నమాజ్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో అందరం కలిసికట్టుగా అన్ని కులాల అన్ని మతాల అతీతంగా ఎప్పుడు కలిసికట్టుగా సోదర భావంతో మెలగాలని ఎమ్మిగనూరు నియోజవర్గం ప్రజలు ఎల్లప్పుడు బాగుండాలని మనసారా ఆ దేవుని ప్రార్థిస్తూ మాజీ ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర మరియు నా తరఫున అయ్యప్ప స్వామి ఆలయానికి బయలుదేరుతున్నటువంటి ప్రతి ప్రతి ఒక్కరికి పేరుపేరునా మా యొక్కహృదయపూర్వక నమస్కారాలు తెలియజేసుకుంటున్నామని నవాజ్ అన్నారు

## ప్రైవేటు స్కూళ్లలో అధిక ఫీజులను అరికట్టండి

### -- పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు ఎస్ఎండీ రఫీ

నంద్యాల :-ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాడు జిల్లా విద్యాశాఖ అధికారి డిఈఓ అనురాధ గారికి వినతి పత్రం సమర్పించారు .ఈ సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు యస్ యమ్ డి . రఫీ మాట్లాడుతూ.నంద్యాల జిల్లా లో ఉన్న ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాల పదవ తరగతి పరీక్ష ఫీజు 125 రూపాయలు ఉంటే ప్రైవేటు కార్పొరేటు స్కూళ్లలో విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి 1000 నుండి 1500 రూపాయలు వసూలు చేస్తున్నారని వారు తెలిపారు. ఏ ఒక్క పాఠశాల కూడా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వసూలు చేసిన రశీదు కూడా ఇవ్వలేదన్నారు.తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు నంద్యాల జిల్లాలో ఉన్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాల తనిఖీలు నిర్వహించి వసూళ్లకు పాల్పడుతున్న పాఠశాలలు గుర్తింపు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు .లేనిపక్షంలో పిడిఎస్యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు దస్తగిరి నవీన్ ఉపాధ్యక్షులు అజిత్ ,నాని, శ్యామ్, అనిల్, హరి,వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ బావమరిది మాంచి స్పీడుమీదున్నాడే!




టాలీవుడ్ లో వారసులకు కొదవలేదన్నవి తెలిసింది. నందమూరి ఫ్యామిలీ నుంచి మెగాస్టార్ ఫ్యామిలీ వరకు ఇండస్ట్రీలో వారసుల హవా నడుస్తోంది. ఇప్పుడు వారికి సంబంధించిన వారు కూడా సినిమాల్లో హీరోలుగా ఎంట్రీ ఇవ్వడం మొదలు పెట్టారు.ఇప్పటికే స్టార్ హీరోల బంధువుల పిల్లలు కూడా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తుంటే తాజాగా స్టార్ హీరో యంగ్ టైగర్ ఫ్యామిలీ నుంచి కూడా మరో హీరో రాబోతున్నాడు. ఎన్టీఆర్ వైఫ్ నార్నే ప్రణతి సోదరుడు నార్నే నితిన్ కూడా హీరోగా తెరంగేట్రం చేయబోతున్న విషయం తెలిందే.నార్నే నితిన్ ని హీరోగా పరిచయం చేస్తూ తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీకి 'శ్రీశ్రీశ్రీ రాజావారు' అనే టైటిల్ ని ఖరారు చేశారు. సతీష్ వేగేశ్న దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ షూటింగ్ సైలెంట్ గా జరుగుతోంది. ఈ ఏడాది మార్చి 19న ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ తో పాటు టైటిల్ ని కూడా మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. గ్రామీణ నేపత్యంలో సాగే మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా ఈ మూవీని దర్శకుడు సతీష్ వేగేశ్న తెరకెక్కిస్తున్నారు. శ్రీ వేదాక్షర మూవీస్ బ్యానర్ పై రామారావు చింతలపల్లి ఎం.ఎస్. రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన షూటింగ్ తో ఈ మూవీ 80 శాతం వరకు పూర్తయిందని తెలుస్తోంది. త్వరలోనే మిగతా భాగాన్ని కూడా పూర్తి చేసి సినిమాను ఫిబ్రవరిలో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్ హీరోగా పరిచయం అవుతున్న సినిమా కావడంతో ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఈ సినిమాకు సపోర్ట్ గా నిలిచే అవకాశం వుంది.అంతే కాకుండా ఈ మూవీ ప్రమోషన్స్ విషయంలో ఎన్టీఆర్ కూడా ప్రధాన పాత్ర పోషించి జాగ్రత్తలు తీసుకుంటారని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా వుంటే యంగ్ టైగర్ ఎన్టీఆర్ 'ఖీఖీఖీ' తరువాత ప్రస్తుతం స్టార్ డైరెక్టర్ కొరటాల శివ డైరెక్షన్ లో తన 30వ ప్రాజెక్ట్ ని చేయబోతున్న విషయం తెలిసిందే.ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ మూవీని యువ సుధా ఆర్ట్స్ బ్యానర్ పై ఎన్టీఆర్ ఆర్ట్స్ నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్ నిర్మించబోతున్నారు. త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

# ఈవారం టాలీవుడ్ చరిత్రలో నిలిచి పోయే రోజు

ఒక వైపు బాలీవుడ్ లో సినిమాలను విడుదల చేసేందుకు నిర్మాతలు భయపడుతున్నారు. కరోనాకు ముందు అక్కడ వారంలో రెండు మూడు పెద్ద చిన్న సినిమాలు వచ్చేవి. అంతకు మించి కూడా సినిమాలు అక్కడ విడుదల అయ్యేవి. కానీ ఇప్పుడు నెలలో రెండు మూడు సినిమాలు కూడా వస్తున్నట్లుగా అనిపించలేదు.అక్కడ పరిస్థితి అలా ఉంటే ఇతర భాషల్లో పరిస్థితి కూడా కాస్త అటు ఇటుగా అలాగే ఉంది. కానీ తెలుగు బాక్సాఫీస్ వద్ద మాత్రం సినిమాల జాతర కొనసాగుతోంది. మొన్న శుక్రవారం పెద్ద ఎత్తున సినిమాలు విడుదల అయ్యాయి. వాటిల్లో ఎక్కువ శాతం బొక్క బోర్లా పడ్డా కూడా ఈ వారం సినిమాల జాతర కొనసాగుతోంది.ఈ వారం విడుదల అవ్వబోతున్న సినిమాల సంఖ్య ఏకంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ దక్కించుకునే అవకాశాలు




కూడా లేకపోలేదు అంటూ ప్రచారం జరుగుతోంది. ఈ శుక్రవారం విడుదల కాబోతున్న సినిమాల సంఖ్య టాలీవుడ్ చరిత్రలో నిలిచి పోవడం ఖాయం అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు మరియు మీడియా సర్కిల్స్ వారు మాట్లాడుకుంటున్నారు.నాలుగు కాదు ఐదు కాదు ఏకంగా 15 నుండి 17 సినిమాలు ఈ వారం విడుదల కాబోతున్నాయి. దాదాపు అన్ని సినిమాలు కూడా చిన్న బడ్జెట్ సినిమాలు. కొన్ని మరీ లో బడ్జెట్ సినిమాలు కాగా మరి కొన్ని డబ్బింగ్ సినిమాలు. ఈ వారం విడుదల కాబోతున్న సినిమాల్లో తమన్నా.. సత్యదేవ్ నటించిన గుర్తుందా శీతాకాలం సినిమాకు మాత్రమే కాస్త బజ్ క్రియేట్ అయ్యింది.అది కాకుండా మరికొన్ని సినిమాలు ఇండస్ట్రీ వర్గాల్లో మరియు మీడియా వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అంతకు మించి ఇతర సినిమాలు పెద్దగా అంచనాలు కలిగి లేవు. ఈ స్థాయిలో సినిమాలు విడుదల అయితే థియేటర్ల పరిస్థితి ఏంటి అనేది అర్థం కావడం లేదు. అసలు ఇన్ని సినిమాలకు థియేటర్ల షేరింగ్ ఎలా అనేది అంతు పట్టడం లేదు.డిసెంబర్ తర్వాత జనవరి లో పెద్ద సినిమాల జోరు మొదలు అయితే వచ్చే ఏడాది సమ్మర్ పూర్తి అయ్యే వరకు పెద్ద సినిమాల జాతర కంటిన్యూ అవ్వబోతుంది. అందుకే తమ వద్ద ఉన్న సినిమాలను ఈ డిసెంబర్ లోనే దులిపేసుకుందామని.. వదిలేసుకుందామని భావిస్తున్నట్లుగా నిర్మాతలు ఉన్నారనే వార్తలు వస్తున్నాయి.భవిష్యత్తులో ఎప్పుడూ కూడా ఈ స్థాయిలో ఒకే వారం లో సినిమాలు విడుదల కాకపోవచ్చు. కనుక ఈ వారం చరిత్రలో నిలిచి పోయే వారం అవుతుంది అంటున్నారు. మరి ఇన్ని సినిమాల్లో కనీసం రెండు మూడు అయినా పాజిటివ్ టాక్ ను దక్కించుకుని గౌరవ ప్రధమైన కలెక్షన్స్ ను రాబడుతుందేమో చూడాలి.

# ధాస్ కీ ధమ్కీ : ఆల్ మోస్ట్ పడిపోయిందే పిల్లా!

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా మూవీ 'దాస్ కీ ధమ్కీ'. తెలుగుతో పాటు ఈ మూవీని తమిళ మలయాళ హిందీ భాషల్లో భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారు. నివేదా పేతురాజ్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీ థియేట్రికల్ ట్రైలర్ ని రీసెంట్ గా సీనియర్ స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ విడుదల చేసిన విషయం తెలసిందే. మాస్ కా దాస్ గా విశ్వక్ సేన్ చేసిన హంగామా ప్రసన్నకుమార్ బెజవాడ అందించిన స్టోరీ డైలాగ్స్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించాయి.ట్రైలర్ రిలీజ్ కు భారీ క్రేజ్ రావడంతో ఈ మూవీ రిలీజ్ ని హీరో విశ్వక్ సేన్ భారీగా ప్లాన్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ మూవీ ప్రమోషన్స్ ని కూడా మొదలు పెట్టాడు. ఇందులో భాగంగా 'ఆల్ మోస్ట్ పడిపోయిందే పిల్లా..'అంటూ సాగే ఫస్ట్ లిరికల్ సాంగ్ వీడియోని తెలుగు హిందీ భాషల్లో మంగళవారం హీరో రానా దగ్గుబాటి సిద్దూ జొన్నలగడ్డ విడుదల చేశారు. తెలుగు వెర్షన్ 'ఆల్ మోస్ట్ పడిపోయిందే పిల్లా..' అంటూ సాగితే హిందీ వెర్షన్ 'ఆల్ మోస్ట్ దిల్ కా పతా మిలా..' అంటూ సాగనుంది.లియోన్ జేమ్స్ సంగీతం అందించగా పూర్ణా చారి సాహిత్యం అందించాడు. ఆదిత్య ఆర్ కె లియోన్ జేమ్స్ ఆలపించారు. యష్ మాస్టర్ డ్యాన్స్ కంపోజ్ చేశారు. అందమైన బీచ్ లొకేషన్ లలో ఈ పాటని హీరో విశ్వక్ సేన్ హీరోయిన్ నివేదా పేతురాజ్ లపై చిత్రీకరించారు. ఈ పాట సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని తెలుస్తోంది. క్యాచీ పదాలతో సాగే ఈ పాట ఖచ్చితంగా ఆడియన్స్ చేత కూడా హమ్ చేయించేలా వుంది.ఇక యష్ మాస్టర్ డ్యాన్స్ కంపోజ్ చేసిన ఈ పాటలో నివేదా పేతురాజ్ గ్లామర్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాస్ స్టెప్పులు స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలవనున్నాయి. నివేదా గత చిత్రాలకు మించి ఈ మూవీగా మరింత గ్లామర్ గా అందాల విందుకు సై అన్నట్టుగా తెలుస్తోంది.తన గ్లామర్ తో ఈ సినిమా కోసం ప్రేక్షకుల్ని థియేటర్లకు రప్పించడం ఖాయం అని చెబుతున్నారు. ఇక హిందీలో ఈ పాటకు అమితాబ్ వర్మ సాహిత్యం అందించగా నకాష్ అజీజ్ తో కలిసి లియోన్ జేమ్స్ ఆలపించాడు. హిందీలోనూ ఈ పాట దుమ్మురేపడం ఖాయంగా కనిపిస్తోంది.విశ్వక్ సేన్ గత సినిమాలకు పూర్తి భిన్నంగా భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా మూవీగా తెరకెక్కించారు.

# వారెవ్వా ఉమ్రాన్.. 151 కిమీ వేగంతో బౌలింగ్! బంగ్లా బ్యాటర్‌కు ఫ్యూజ్‌లు ఔట్

బంగ్లాదేశ్‌తో రెండో వన్డేలో టీమిండియా ఎక్స్‌ప్రెస్ పేసర్ ఉమ్రాన్ మాలిక్ సంచలన బంతితో మెరిశాడు. బంగ్లాదేశ్ బ్యాటర్ షాంటోను అద్భుతమైన ఇన్‌స్వింగర్‌తో మాలిక్ క్లీన్ బౌల్డ్ చేశాడు.గంటకు 151 కిమీ వేగంతో వేసిన డెలివరీని షాంటో ఆపే లోపే బంతి వికెట్లను గిరాటేసింది.దీంతో బంగ్లా బ్యాటర్ కూడా బిత్తరపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇక ఉమ్రాన్ తన తొలి ఓవర్‌లోనే బంగ్లా బ్యాటర్ షకీబ్ అల్ హసన్‌కు చుక్కలు చూపించాడు. ఉమ్రాన్ బౌలింగ్‌లో బంతిని ముట్టడానికే షకీబ్ భయపడ్డాడు.ఇక రెండో వన్డేలో భారత బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నారు. తొలుత బ్యాటింగ్ చేస్తున్న బంగ్లాదేశ్ 80 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. మరోవైపు ఈ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా.. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చేతి వేలికి గాయమైంది. దీంతో అతడు ఫీల్డ్‌ను విడిచి పెట్టి వెళ్లాడు. రోహిత్ తిరిగి బ్యాటింగ్‌కు వచ్చేది అనుమానంగా మారింది.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190